J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74

నెల్లూరు, 03.01.2020, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 31 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

> తక్కువ పెట్టుబడితో సంపూర్ణ రాజధానికి రూపం
> హైదరాబాదుకు ధీటుగా ఎదగనున్న విశాఖపట్నం
> సత్వర ప్రగతికి సులువైన మార్గం
> అన్ని వర్గాల వారికీ అనుకూలం
> అన్ని రంగాలకు అపూర్వ అవకాశం



- వేగవంతమైన అభివృద్ధికి...

# వెలుగురేఖ.. విశాఖ

సమాజం మారుతోంది, శరవేగంగా ముందుకు వెళ్తోంది. ఎద్దుల బండి కాలం నుండి జెట్‌స్పీడ్ విమానాల స్థాయికి ఎదిగిపోయింది. పోస్టుకార్డు కాలం పోయి ఇప్పుడు ఫాస్ట్‌గా వెళ్లే వాట్సాప్ లాంటి ఆధునిక సమాచార వ్యవస్థ ఏర్పడిపోయింది. మనిషి జీవన విధానం మారింది. ప్రతి విషయంలోనూ వేగాన్ని కోరుకుంటున్నాడు. ఆహారం ఫాస్ట్‌ఫుడ్, వస్త్రధారణ రెడీమేడ్, నివాసం అపార్ట్‌మెంట్ లేదా విల్లా, దోశపిండి కావాలంటే రెడీమేడ్, చపాతీ తినాలంటే రెడీమేడ్... ఇలా చెప్పుకుంటూ పోతే అన్నీ ఇన్‌స్టంట్(సత్వరం)గా లభించే స్థాయికి సమాజం మారిపోయింది. అలాంటి జెట్‌స్పీడ్ కాలంలో ఎప్పుడో పాతికేళ్ళ తరువాత అభివృద్ధి చెందే రాజధానిని జనం కోరుకోరు, తక్షణ సేవలు అందించగలిగే మౌలిక వసతులున్న రాజధానికే ఓటేస్తారు. ఇలాంటి ఆలోచనతోనే జగన్ ప్రభుత్వం విశాఖను రాజధానిగా ఎంపిక చేసి వుంటుందని మేధావులు అభిప్రాయపడుతున్నారు. (మిగతా 11వ పేజీలో)

## నెల్లూరుకి వస్తున్న వెంకయ్య

- 19 నుండి జన్మభూమిలో...



రాజ్యానికి రాజైనా, అమ్మకు కొడుకే. అలాగే వ్యక్తి ఎంతటి ఉన్నత స్థానానికి వెళ్ళి ఏ దేశంలో ఉన్నా, తాను పుట్టిన గడ్డని మరువ కూడదు. ఇదీ ఉపరాష్ట్రపతి మన వెంకయ్య తరచూ చెప్పే సూక్తి. ఆయన ఇతరులకు ఏదైనా చెప్పేముందు తాను ఆచరించి చూపిస్తాడు. తరచూ తన జన్మభూమి నెల్లూరుకు వచ్చి అందరినీ పలుకరిస్తాడు. (వార్త11వ పేజీలో)

## 'బర్డ్' డైరెక్టర్‌గా డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి



- పేదల సేవలో నెల్లూరు వైద్యుడు

తిరుమల తిరుపతి దేవస్థానాల అనుబంధ సంస్థ తిరుపతిలోని బర్డ్ డైరెక్టర్‌గా నెల్లూరీయుడు, అపోలో ఆసుపత్రులలో చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మునమాల మదన్‌మోహన్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది.

నెల్లూరుజిల్లా కలువాయి గ్రామానికి చెందిన మదన్‌మోహన్‌రెడ్డి 25ఏళ్లుగా చెన్నై అపోలో ఆసుపత్రిలోనూ, (మిగతా 11వ పేజీలో)




# ముహూర్తం ఖరారైనట్లే!

## ఎమ్మెల్యేల వలస మొదలైంది



జగన్‌ను కలిసిన టిడిపి ఎమ్మెల్యే మద్దాలి

**2020** నాటికి తాను జాతీయ రాజకీయాలలో గిర్రున చక్రం తిప్పుతూ వుండాలని తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు కలలు కన్నాడు. కాని, సరిగ్గా ఆ సంవత్స రంలోకి ప్రవేశించేసరికి ఆయనకు షాక్‌ల మీద షాక్‌లు తగిలి ప్రతిపక్ష నేత హోదా కూడా కోల్పోయే పరిస్థితి కొచ్చాడు. గత ఐదేళ్లలో ముఖ్య మంత్రిగా చంద్రబాబు ఏదైతే మార్గాన్ని అనుసరించాడో అదే మార్గంలో ఇప్పుడు ఆయన ఎమ్మెల్యేలు కూడా నడవడానికి సిద్ధపడ్డారు. ప్రతిపక్షంలో వున్న తెలుగుదేశం పార్టీని వదిలి వేరు పక్షంగా వుండడానికి సిద్ధమవుతున్నారు.

ఇప్పటికే గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తెలుగుదేశం పార్టీని వదిలి అసెంబ్లీలో వేరుగా కూర్చుంటుండడం తెలిసిందే! మరో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా జంపింగ్‌కు సిద్ధంగా వున్నాడు. విశాఖపట్నంను రాజధానిగా ప్రకటించాక గంటా ఇంకొంచెం స్పీడయ్యాడు. తెలుగుదేశాన్ని ఏ నిముషంలో అయినా వదలడానికి సిద్ధంగా వున్నాడు. కాగా, గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ కూడా తెలుగుదేశాన్ని వీడుతున్న సంకేతాలను అందించాడు. ఇటీవల ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసిన ఆయన (మిగతా 11వ పేజీలో)

### గతేడాది కంటే..
# ఈ ఏడాది నేరాలు తగ్గాయి

- జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్



గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది (2019) జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టాయని జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ అన్నారు. గతనెల 30న ఆయన నగరంలోని పోలీసు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గత ఏడాది జిల్లాలో 14,860 కేసులు నమోదైతే ఈ ఏడాది 10,470 కేసులు నమోదయ్యాయన్నారు. అదేవిధంగా గతేడాది హత్యకేసులు 66 నమోదైతే ఈ ఏడాది 49 నమోదయ్యాయని తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు స్వల్పంగా తగ్గాయని, గతేడాది 1378 ప్రమాదాలు జరిగి 536 మంది మరణిస్తే, ఈ ఏడాది 1268 ప్రమాదాలు జరిగి 526 మంది చనిపోయారని తెలిపారు. ఐపిసి కేసులు 12,804 నమోదైతే ఈ ఏడాది కేవలం 6637 కేసులు మాత్రమే నయోదయ్యాయని, తాము తీసుకున్న ముందస్తు చర్యలతో దొంగతనాలు కూడా తగ్గాయని పేర్కొన్నారు. గతేడాది చోరీ కేసులు 1275 నమోదైతే ఈ ఏడాది 1025 కేసులు నమోదయ్యాయన్నారు. అపహరణ కేసులు కొంచెం పెరిగాయని, గతేడాది 32 ఉంటే ఈ ఏడాది 37కు చేరాయని చెప్పారు. దాడికేసులు గతేడాది 830 నమోదు కాగా, ఈ ఏడాది వాటి సంఖ్య 1043 కు చేరిందన్నారు. గత ఏడాదితో పోల్చిచూస్తే ఈ ఏడాది మహిళలపై నేరాలు కట్టడిచేశామని, గతేడాది 851 కేసులు నమోదైతే ఈ ఏడాది 705 కేసులు నమోదయ్యాయన్నారు. వైట్‌కాలర్ నేరాలపై ప్రత్యేకదృష్టి సారించి అనేకమంది నిందితులను అరెస్ట్ చేశామని, ఇందుకు సంబంధించి గతేడాది 425 మోసాల కేసులు నమోదు కాగా ఈ ఏడాది 479 కేసులు పెట్టామని, అదేవిధంగా ఎస్సీ ఎస్టీ కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి నిందితులకు కఠినశిక్షలు పడేలా చేశామని, ఫలితంగా ఎస్సీఎస్టీ కేసుల సంఖ్య తగ్గించగలిగామని తెలిపారు. గతేడాది 136 కేసులు నమోదైతే, ఈ ఏడాది 111 కేసులు నమోదయ్యాయన్నారు.

### వాహనాల తనిఖీలు ముమ్మరం...

గతేడాది వాహనాలను తనిఖీ చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారికి సంబంధించి 1,38,724 చలానాలు రాయగా, ఈ ఏడాది 2,17,369 చలానాలు విధించి మొత్తం 68 కోట్ల రూపాయలు వసూలుచేశామన్నారు. అదేవిధంగా మద్యం, గంజాయి, గుట్కా విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనధికార మద్యం విక్రయాలకు సంబంధించి గతేడాది 99 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 329 కేసులు పెట్టామన్నారు. గతేడాది 12 గంజాయి కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 26 కేసులు నమోదు చేశామని, అదేవిధంగా 58 గుట్కా కేసులు నమోదుచేశామని చెప్పారు. చిన్నారులకు రక్షణ కల్పించేందుకు, మహిళల భద్రతకు పటిష్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. నేర రహిత జిల్లాగా జిల్లాను తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ క్రైమ్స్ పి.మనోహర్‌రావు, ఎస్‌బి డిఎస్పీ ఎన్.కోటారెడ్డి, ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిల్వ ఆహారం స్వాధీనం

- అపరిశుభ్ర వాతావరణంలో విక్రయాలు
- భారీగా జరిమానాలు విధింపు

నిల్వచేసిన చికెన్ వగైరాలతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నా వ్యాపారుల్లో ఏమాత్రం మార్పు ఉండడం లేదు. ధనార్జనే ధ్యేయంగా వ్యాపారులు అపరిశుభ్ర వాతావరణంలో చికెన్ వగైరాలను ఉంచేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూనే ఉన్నారు. తాజాగా గూడూరులో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఇటీవల పలు పలసరుకుల దుకాణాల్లో దాడులు జరిపి నిల్వచేసిన చికెన్, స్వీట్లు, పండ్లు వగైరాలను స్వాధీనం చేసుకుని, మునిసిపల్ సిబ్బందికి అప్పగించారు. ఈ సందర్భంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ పలు కిరాణా దుకాణాల్లో పప్పులు, నూనెలు శ్యాంపిల్స్ తీసి ల్యాబ్‌లకు పంపామని, 12 దుకాణాలపై కేసులు నమోదు చేసి 60 వేలు జరిమానా విధించామని చెప్పారు. పలు సార్లు దాడులు చేసినా దుకాణాల నిర్వాహకుల్లో మార్పు రావడం లేదని, ఇకపై కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎస్.శ్రీనివాస్, ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

### కల్తీ ఆహార పదార్థాల కేంద్రాలపై దాడులు

రంగులు కలిపిన, నాణ్యతలేని ఆహార పదార్థాలపై ఫుడ్ కంట్రోలు అధికారులు గతనెల 31న కావలిలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కావలి కమిషనర్ వెంకటేశ్వర్లుతో కలిసి మాంసపు దుకాణాలు, హోటళ్లపై దాడులు చేశామని, రంగులు కలిపిన, నిల్వ ఉన్న మాంసం, ఆహారాన్ని కనుగొన్నామని తెలిపారు. 8 చోట్ల దాడులు జరిపి రూ.26 వేల జరిమానా విధించామన్నారు. గెజిటెడ్ ఫుడ్ కంట్రోలర్ అధికారి శ్రీనివాస్, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 24.25 లక్షల మంది ఓటర్లు

## ఓటర్ల జాబితాలో సవరణలకు 22 దాకా సమయం

జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో మొత్తం 24,25,519 మంది ఓటర్లు ఉన్నారని డిఆర్ఓ మల్లికార్జున చెప్పారు. ఈనెల1న జిల్లా రెవెన్యూ అధికారి భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదుతో పాటు, ఓటర్ల జాబితాలో సవరణలకు జనవరి 22వ తేది వరకు మాత్రమే సమయం ఉందన్నారు. ఓటర్ల జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే వాటిని అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను వచ్చే ఫిబ్రవరి 3వతేది నాటికి పరిష్కరిస్తామని, ఫిబ్రవరి 14వ తేదీకి తుది జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ఒకే నియోజకవర్గంలో ఓటరు జాబితాల్లో పేరు మార్పుకు ఫారమ్ 8(ఏ) ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఒకే నియోజకవర్గంలో ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి తమ ఓటు మార్చుకోవాలనుకునేవారు కూడా ఫారమ్-8 (ఏ) ద్వారా నమోదు చేసుకోవాలని చెప్పారు. ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి మారే ఓటర్లు తమకు ఓటు ఉన్న నియోజకవర్గంలో ఫారమ్-7 ద్వారా తమ ఓటును తొలగించుకుని, తమకు ఓటు కావాల్సిన నియోజకవర్గంలో ఫారమ్-6 ద్వారా ఓటుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఏడాది జనవరి 1వ తేది నాటికి 18 ఏళ్ళ వయసున్న వారు ఎవరైనా ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోవచ్చని, వచ్చే ఫిబ్రవరి 22వ తేది వరకు మాత్రమే కొత్త ఓటు నమోదు చేసుకోవడానికి సమయం ఉందని వివరించారు. ఓటరు జాబితా ముసాయిదా ప్రతిని అన్ని రాజకీయపార్టీలకు పంపించడం జరిగిందని, రాజకీయ పార్టీలు ఓటరు జాబితాను పరిశీలించి ఏవైనా అభ్యంతరాలుంటే పోలింగ్ ఏజెంట్ల ద్వారా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

## సింహపురి సమాచారం

### కేంద్ర ప్రభుత్వ బృందం పర్యటన

నెల్లూరు జిల్లాలో అమలవుతున్న మిషన్ అంత్యోదయ పథకానికి సంబంధించిన పనితీరును పరిశీలించేందుకు ఇద్దరు సభ్యులతో కూడిన బృందం జిల్లా పంచాయితీ కార్యాలయానికి గతనెల 31న చేరుకుంది. బృందం సభ్యులు సంతోష్ ఫరీదా, సుమిత్రా సాహులు మాట్లాడుతూ తాము పలు గ్రామాలను పర్యటించి ఇక్కడి చూసిన స్థితిగతులను కేంద్రానికి నివేదిక ఇస్తామన్నారు. జిల్లా పంచాయితీ అధికారి ఎం.ధనలక్ష్మీ బృందం సభ్యులతో సమావేశమై మిషన్ అంత్యోదయ పథకానికి సంబంధించి ప్రణాళికను సిద్ధం చేశామని వివరించారు.

### కోడిగుడ్ల సరఫరాకు త్వరలో టెండర్లు

జిల్లాలో మధ్యాహ్నభోజనం అమలవుతున్న పాఠశాలల్లో 2020-21 సంవత్సరానికి డివిజన్ల వారీగా కోడిగుడ్లు సరఫరా చేసేందుకు త్వరలో టెండర్లు పిలవనున్నామని, ఆసక్తి కలవారు నేరుగా డిఇఓ కార్యాలయాన్ని సంప్రదించాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దనాచార్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### ఆర్ఎం రామం బదిలీ

నెల్లూరు ఆర్టీసీ ఆర్ఎం రామం బదిలీ అయ్యారు. ఆయనను కర్నూలు ఆర్టీసీ ఆర్ఎంగా పంపించారు. కడప ఆర్ఎంగా వున్న పి.వెంకటశేషయ్య నెల్లూరు ఆర్ఎంగా రానున్నారు.

### అశోక్‌రావుకు సన్మానం

నెల్లూరు వీఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ అశోక్‌రావును అఫిలియేటెడ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్(ఏసీటీఏ) ఆధ్వర్యంలో గతనెల 31న వీఆర్ కళాశాలలో సన్మానించారు. ప్రిన్సిపల్ బాబర్‌ఆలీ, ఫోరం సభ్యులు మస్తానయ్య, వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు శోభనాద్రి, పీవీ రత్నం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీసు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెక్కులు



విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు కుటుంబాలకు జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ గతనెల 31న భద్రతా ఎక్స్‌గ్రేషియా చెక్కులు పంపిణీ చేశారు. హెడ్ కానిస్టేబుల్ కె రవీంద్రబాబు, పోలీస్ కానిస్టేబుల్ షేక్ అఫ్సర్ బాషాలు ఇటీవల మృతి చెందారు. వీరికి రావల్సిన రూ.4 లక్షల చొప్పున చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు మద్దిపాటి ప్రసాదరావు, ఏవో ఎం విజయకుమార్, సూపరింటెండెంట్ ఎన్.రామానారాయణరెడ్డి, రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్సాహంగా ఎడ్లబండ్ల పోటీలు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈనెల 1 న ఇందుకూరుపేట మండలం గంగపట్నంలో రాష్ట్ర స్థాయి ఎడ్లబండ్ల పోటీలను నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో దాదాపు 60కి పైగా ఎడ్లబండ్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో లేగుంటపాడుకు చెందిన నంద్యాల శంకరయ్య ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచాయి. కోవూరుకు చెందిన కర్ణగుంట ప్రభాకర్ ఎద్దులు ద్వితీయస్థానాన్ని సాధించాయి. గంగపట్నానికి చెందిన పంబాల హరీష్‌రెడ్డి ఎద్దులు తృతీయస్థానాన్ని సాధించగా, ముదివర్తికి చెందిన తలారి శ్రీను, కోవూరుకు చెందిన మడిశెట్టి శ్రీనివాసులు ఎద్దులు నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచి వరుసగా రూ.25వేలు, రూ.20వేలు, రూ15వేలు, రూ.12వేలు, రూ.10వేలు నగదును ముఖ్యఅతిథులుగా విచ్చేసిన వైయస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మావులూరు శ్రీనివాసులురెడ్డి, పంబాల జనార్థన్, ఇందుకూరుపేట ఎస్సై నరేష్ నుండి అందుకున్నారు. ఎడ్లబండ్ల పోటీలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి రైతులు, అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఎండ్ల బండ్ల పోటీలు మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయన్నారు. వరుసగా రెండో ఏడాది రాష్ట్రస్థాయి ఎండ్లబండ్ల పోటీలను విజయవంతంగా నిర్వహించిన కమిటీసభ్యులను అభినందించారు. తొలుత ఆయన జెండా వూపి పోటీలను ప్రారంభించారు. జడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ ముజీర్, స్థానికులు బుజ్జిరెడ్డి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కొండూరు కృష్ణారెడ్డి, పెనుబల్లి హనుమంత నాయుడు, కేతిరెడ్డి సతీష్‌రెడ్డి, నరసాపురం మాజీ సర్పంచ్ తాతా సురేంద్ర, దుగ్గా శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వ్యాఖ్యాతగా ఉడతా సురేష్ వ్యవహరించారు.

## అంకాళమ్మ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మేకపాటి

రాపూరు మండలంలోని వేపినాపిలో గ్రామదేవత అంకాళమ్మ ఆలయం 2020 క్యాలెండర్‌ను నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. గతనెల 30న నెల్లూరులోని తన నివాసంలో ఈ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో పాపకన్ను శేఖర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మల్లు సుధాకర్‌రెడ్డి, పూనూరు కృష్ణారెడ్డి, అలిమిలి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంవి కృష్ణప్రసాద్, కవిడివి ప్రసాద్‌రెడ్డి, బులగాకుల మధురెడ్డి, మేరిగ మురళీధర్, తోట సంజీవరెడ్డి, పి.విశ్వవిజ్ఞానాచారి పాల్గొన్నారు.

# కోలాహలంగా కొత్త సంవత్సర వేడుకలు

2020 నూతన సంవత్సర వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి నెల్లూరులోనూ, జిల్లాలోని ముఖ్య పట్టణాలు, గ్రామాలలోనూ కొత్త సంవత్సర సందడి నెలకొంది. కొత్త సంవత్సరం అంటనే మందు, మాంసాహారాలతో జల్సా చేయడం అన్న ఒక ఫీలింగ్ జనాలలో వుంది. దానికి తగ్గట్లే బార్‌లు మందు బాబులతో కిటకిటలాడాయి. అయితే ప్రభుత్వం అమలులోకి తెచ్చిన మద్యం నియంత్రణ మందుబాబులపై తీవ్ర ప్రభావం చూపింది. వైన్‌షాపులు తక్కువగా వుండడం, అవి కూడా నిర్ణీత సమయానికే మూసేస్తుండడంతో వాటి ముందు జనాలు పోలింగ్ కేంద్రం ముందు ఓటర్ల మాదిరిగా క్యూకట్టారు. హోటళ్లు, బేకరీలు, స్వీట్ షాపుల వ్యాపారం బాగానే జరిగింది. రాత్రి 11 గంటలపైన యువకులు గుంపులు గుంపులుగా రోడ్ల మీదకు వచ్చి బైక్‌లలో విహారాలు చేశారు. రాత్రి 12గంటలు కాగానే కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేరింతలు కొట్టారు.

గతంలో నూతన సంవత్సరంలోకి ప్రవేశించేటప్పుడు ఆలయాలు తెరిచి భక్తుల సందర్శనకు అనుమతించేవాళ్ళు. అయితే ఈసారి చాలా గుళ్ళు తెరవలేదు. అర్ధరాత్రిళ్లు గుళ్లు తెరవడం శాస్త్రోక్తంగా పద్ధతి కాదని ముందే ప్రకటించి వున్నారు. కాని, సాయిబాబా మందిరాలతో పాటు మరికొన్ని చిన్నచిన్న దేవాలయాలను తెరవడంతో భక్తులు పోటెత్తారు.

అయితే ఇంతకుముందు సంవత్సరాలతో పోలిస్తే ఈ ఏడాది న్యూ ఇయర్ జోష్ కొంత తగ్గిందనే చెప్పాలి.

ఆర్థిక మాంద్యం, వ్యాపారాలు పడిపోవడం, మద్యంపై నియంత్రణ, పోలీసుల కఠిన చర్యలు, అన్నింటికిమించి జనవరి1 మనకు నూతన సంవత్సరం కాదు, ఉగాది మన కొత్త సంవత్సరం అన్న ప్రచారం కూడా జోష్ తగ్గడానికి కారణమైంది.

## అధికారులకు శుభాకాంక్షల వెల్లువ





సిబ్బంది నుండి కొత్త సంవత్సర శుభాకాంక్షలు అందుకుంటున్న ఎస్పీ భాస్కర్‌భూషణ్, జేసీ వినోద్‌కుమార్

2020 నూతన సంవత్సరం సందర్భంగా నెల్లూరులోని రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారుల నివాసాలు శుభాకాంక్షలు తెలపడానికి వచ్చిన వారితో సందడిగా కనిపించాయి. నెల్లూరులో మంత్రులు అనిల్‌కుమార్‌యాదవ్, మేకపాటి గౌతమ్‌రెడ్డిలతో పాటు ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పలు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల నివాస గృహాలు అభిమానులతో కోలాహలంగా కనిపించాయి. జిల్లాలో ఒకరిద్దరు ఎమ్మెల్యేలు నూతన సంవత్సర వేడుకలలో ఆర్భాటాలు చేయొద్దని తమ అభిమానులకు ముందుగానే పిలుపునివ్వడం జరిగింది. జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్‌ను, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.వినోద్ కుమార్‌ను, డిఆర్‌ఓ మల్లిఖార్జున్‌ను వివిధ శాఖల ఉన్నతాధికారులను ఆయా శాఖల ఉద్యోగులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



చేవూరు దేవకుమార్‌రెడ్డికి కేక్‌ను తినిపిస్తున్న మహిళ



## విపిఆర్‌ని కలిసిన ప్రతాప్ భీమిరెడ్డి

ఆంధ్రప్రదేశ్ పెట్టుబడి ప్రోత్సాహకాలు మరియు మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ప్రత్యేక ప్రతినిధి ప్రతాప్ భీమిరెడ్డి నెల్లూరులో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశాడు. పెట్టుబడిదారులను ఆకర్షించి రాష్ట్రాన్ని పారిశ్రామిక పరంగా అభివృద్ధి చేయడానికి కృషి చేయవలసిందిగా విపిఆర్ ప్రతాప్‌కి సూచించారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో యువతకు మంచి అవకాశాలు కల్పిస్తున్నారని, రాబోయే రోజుల్లో రాష్ట్రం పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందన్న ఆశాభావాన్ని ప్రతాప్ వ్యక్తపరుస్తూ ఆ దిశగా తామంతా పనిచేసి జగన్మోహన్‌రెడ్డి తమపై వుంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని అన్నాడు.

### ఆర్టీసీ కార్మికులకు

## ముందుగానే సంక్రాంతి



అందరికీ ఈ నెల 14, 15, 16 తేదీలలో సంక్రాంతి పండుగైతే ఆర్టీసీ కార్మికులకు రెండు వారాల ముందుగానే వచ్చేసింది. 2020 సంవత్సరం తొలిరోజే ఆర్టీసీ కార్మికులకు తీయని కానుకను అందించింది. ఆరోజు నుండే ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొందారు. కార్పొరేషన్‌గా వున్న ఆర్టీసీ ప్రజా రవాణా సంస్థగా మారిపోయింది.

నెల్లూరు ఆర్టీసీ జోన్ పరిధిలో 19 మంది అధికారులు, 1592 మంది డ్రైవర్లు, 1359 మంది కండక్టర్లు, 197 మంది ట్రాఫిక్ విభాగ సిబ్బంది, 567 మంది మెకానిక్ విభాగ సిబ్బంది, 105 మంది ఆఫీసు సిబ్బంది, 66 మంది సెక్యూరిటీ సిబ్బంది ప్రభుత్వోద్యోగులుగా మారిపోయారు. అంతేకాదు, ఆర్టీసీలో ఉన్నతాధికారుల హోదాలు కూడా మారాయి. జోన్ ఇ.డిని అడిషనల్ కమిషనర్‌గా, ఆర్ఎంను జాయింట్ కమిషనర్‌గా, డిఎంను సహాయ కమిషనర్‌గా మార్పు చేశారు. జనవరి 1వ తేదీ నుండి తాము ప్రభుత్వ ఉద్యోగులం కావడంతో కార్మికులు సంబరాలలో మునిగారు. జిల్లాలోని 10 డిపోలలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పేర్ని నానిల చిత్రపటాలకు పాలాభిషేకాలు నిర్వహించి స్వీట్లు పంచుకున్నారు.

### వైసిపిలో పనిచేసే...

## ప్రతి ఒక్కరికీ గుర్తింపు

### - డిసిఎంఎస్ ఛైర్మెన్ ప్రమాణస్వీకారోత్సవంలో మంత్రి అనిల్

నెల్లూరుజిల్లా వైఎస్సార్సీపికి కంచుకోట అని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా నూటికి నూరు శాతం విజయం సాధిద్దామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా.పి.అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. గతనెల 29న జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్) ఛైర్మెన్‌గా వీరి చలపతి ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అనిల్ మాట్లాడుతూ రాజధాని విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమైనదని కొనియాడారు. ముఖ్యమంత్రి జగన్ ప్రజలకోసం అందిస్తున్న ప్రజాసంక్షేమ పథకాలు చూసి చంద్రబాబుకి మతిభ్రమిస్తోందని, నేడు తెలుగుదేశం పార్టీలో నాయకత్వం కోసం వెతుక్కునే పరిస్థితి ఉందని విమర్శించారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి వీరి చలపతి ప్రధాన అనుచరునిగా ఉంటూ వైఎస్సార్సీపి ఆవిర్భావం నుంచి పార్టీకి సేవలందిస్తున్నారని, అలాంటి వ్యక్తికి పార్టీనుంచి మంచి గుర్తింపు లభించడం, ఆయనకు డిసిఎంఎస్ ఛైర్మెన్‌గా పదవి లభించడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు.

జిల్లా రైతాంగానికి మరింత సేవ చేసే భాగ్యం కలిగినందుకు ఆనందంగా ఉందని డిసిఎంఎస్ ఛైర్మెన్‌గా ప్రమాణస్వీకారం చేసిన వీరి చలపతి అన్నారు. తొలుత గాంధీబొమ్మ సెంటర్ నుంచి టౌన్‌హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రమాణ స్వీకారోత్సవానికి వైఎస్సార్సీపి నాయకుడు రూప్‌కుమార్‌యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి ఎంపీ బల్లి దుర్గాప్రసాద్, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి, వరప్రసాదరావు, కిలివేటి సంజీవయ్య, డిసిసిబి ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, వైఎస్సార్సీపి నెల్లూరు రూరల్ కార్యాలయ ఇన్‌చార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వైఎస్సార్సీపి నాయకుడు బీద మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



డిసిఎంఎస్ ఛైర్మెన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న వీరి చలపతి



గత నెల 30న నెల్లూరు, బారకాసు శ్రీరామ మందిరంలో ఆంగ్ల సంవత్సరం క్యాలండర్‌ను ఆవిష్కరించిన వీరిశెట్టి హజరత్ బాబు, తిరుపతి హరగోపాల్, వరిగొండ సురేష్‌బాబు

## అమరావతిపై అబద్ధాలాడుతున్నారు

### - బీద రవిచంద్ర ఆగ్రహం



అమరావతిపై అధికారపార్టీ నాయకులు అబద్దాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఆరోపించాడు. ఈ నెల 2న నెల్లూరులోని జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అభివృద్ధిని మరచి, రాజధానిపై గందరగోళ ప్రకటనలకే పరిమితమైందని ఆరోపించాడు. జిఎన్ రావు కమిటీ నివేదిక రాకముందే రాజధానిపై మంత్రులు ఇష్టారాజ్యంగా ఎలా ప్రకటనలు చేస్తారని ఆయన ప్రశ్నించాడు. రాజధాని మార్పు ఎవరి ప్రయోజనాల కోసమో ముఖ్యమంత్రి బహిరంగ పరచాలని, తమ ప్రాంతమే రాజధాని కావాలని ఏ ఒక్కరూ డిమాండ్ చేయలేదని, అమరావతి రాజధానిని అందరూ స్వాగతించారని ఆయన పేర్కొన్నాడు. చంద్రబాబు విజన్‌పై ప్రజలను అయోమయానికి గురిచేస్తూ అమరావతి రాజధాని నిర్మాణం పూర్తి కావాలంటే తక్షణమే లక్షా 9వేల కోట్ల రూపాయలు అవసరమని, అది అధిక ఖర్చుతో కూడుకున్నది కాబట్టి 10వేల కోట్లతో రాజధాని పూర్తయ్యేలా రాజధానిని విశాఖకు మారుస్తున్నామని చెప్పడం శుద్ధ అబద్ధమన్నాడు. 2050లోగా అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే ఉద్దేశ్యంతో చంద్రబాబునాయుడు 35ఏళ్ళ అభివృద్ధి ప్రణాళికను రచించారని, దానిపై వైసిపివాళ్ళు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశాడు.

## 'ప్రభా'తం

# కలిసిరాని 'రాజ'నగరం



రాష్ట్ర విభజన నాటికి ముఖ్య మంత్రులుగా పని చేసిన వాళ్ళు సీమాంధ్ర ప్రాంతానికి ఎంత అన్యాయం చేశారో అర్థమైపోయింది. ఇక విభజన తర్వాత ఏర్పడ్డ నవ్యాంధ్ర రాజధాని విషయంలో తొలి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతి కేంద్రంగా అభివృద్ధి కేంద్రీకరణకే మొగ్గుచూపాడు. దాని పర్యవసానాలేమిటో ఇప్పుడు చూస్తున్నాం. రాష్ట్ర విభజన జరిగిన ఆరో సంవత్సరంలోనే మళ్ళీ రాజధాని మార్పు.. విశాఖపట్నం కేంద్రంగా రాజధాని ఏర్పాటు చేసే ప్రయత్నాలలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వముంది.

ఆంధ్రప్రదేశ్ ప్రజల తలరాతో, విధిరాతో తెలియదుగాని, ఆంధ్రులకు రాజధాని అనే అంశం ఎప్పుడూ కలిసిరావడం లేదు. ఆంధ్రులకు వలసజీవులుగా పేరుంది. ఈ రాష్ట్రం వాళ్ళు ఎక్కడికైనా పోగలరు, ఎక్కడైనా బ్రతకగలరు. కాబట్టే మాకు ఫలానా చోటే రాజధాని వుండాలనేంత పట్టుదల ఏదీ లేదు. చరిత్రను తవ్వుకుంటూ పోతే తెలుగుప్రజలకు ఎన్ని రాజధానులు మారాయో లెక్కేలేదు. ఒక్కో రాజ వంశం ఒక్కో పట్టణాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలించిన దాఖలాలున్నాయి. మన రాష్ట్రంలో చూస్తే విజయనగరం, బొబ్బిలి, రాజమహేంద్రవరం, పిఠాపురం, సామర్లకోట, కనిగిరి, సింహపురి, వెంకటగిరి, ఉదయగిరి, మార్కాపురం, అమరావతి... ఇలా ఎన్నో పట్టణాలు స్వాతంత్ర్యానికి పూర్వం రాజధానుల కళను సంతరించుకుని ఒక వెలుగు వెలిగాయి.

మొఘలులు, ఆ తర్వాత బ్రిటీష్ వారి రాకతో రాజులుపోయారు, రాజ్యాలు పోయాయి. రాజధానుల విధానం కూడా మారిపోయింది. పెద్ద నగరాలు, పట్టణాలనే రాజధానులుగా ఎంచుకుంటూ వచ్చారు.

బ్రిటీష్ వారి నుండి స్వాతంత్ర్యం వచ్చాక దేశంలో ఏర్పడ్డ రాష్ట్రాలలో తెలుగువారి కంటూ ప్రత్యేక రాష్ట్రం లేకుండాపోయింది. తెలుగు ప్రాంతాలన్నీ కూడా కొంత ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోను, ఇంకొంత ప్రాంతం ముంబై రాష్ట్రంలోనూ, మరికొంత భాగం ఒడిస్సాలోనూ వుండేది. అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలితంగా తెలుగు ప్రజల కోసం ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. దీనికి తొలిరాజధానిగా కర్నూలును పెట్టుకున్నారు. కర్నూలులోనే గుడారాలు వేసుకుని పరిపాలన మొదలుపెట్టారు. కష్టమో నష్టమో కొన్నాళ్ళపాటు అక్కడ నుండే పరిపాలన సాగివుంటే కర్నూలు క్రమంగా అభివృద్ధి చెంది వుండేది. ఒక పెద్ద నగరంగా అవతరించేది. అయితే ముంబై రాష్ట్రం నుండి తెలంగాణ విడిపోయిన తరుణంలో ఇరు ప్రాంతాల వారు కలిసి ఒకే గొడుగు క్రిందకు చేరదామని సమాలోచనలు చేయడం, ఆంధ్రరాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌గా మారడం జరిగింది. రాజధాని ఒక ప్రాంతానికి, ముఖ్యమంత్రి కుర్చీ ఇంకో ప్రాంతానికి ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందమే ఆంధ్రుల కొంప ముంచింది. ఆంధ్రా నాయకులు అప్పట్లోనే పదవుల కోసం అర్రులు చాచారు. అంతేగాక ఏ వసతులు లేని కర్నూలు కంటే, అప్పటికే అందమైన భవంతులతో అలరారుతున్న హైదరాబాదే వీరిని ఆకర్షించింది. అందుకే అందరూ కలిసి హైదరాబాద్‌ను రాజధానిగా నిర్ణయించారు. ఆ తర్వాత హైదరాబాద్ దశ, దిశ మారిపోయింది. ఆంధ్ర ప్రాంతానికి చెందిన నీలం సంజీవరెడ్డి, భవనం వెంకట్రామ్, కాసు బ్రహ్మానందరెడ్డి, దామోదరం సంజీవయ్య, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, నందమూరి తారక రామారావు, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, చంద్రబాబునాయుడు, వైయస్ రాజశేఖరరెడ్డి, కె.రోశయ్య, ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డిలు రాష్ట్ర ముఖ్యమంత్రులుగా పని చేసినా అందరూ హైదరాబాద్ అభివృద్ధికి పెద్దపీట వేసినవాళ్ళే! హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరాల స్థాయిలో నిలబెట్టడానికి కృషి చేసినవాళ్ళే! వీరిలో ఏ ఒక్కరు కూడా తమ పరిపాలనాకాలంలో హైదరాబాద్‌కు ప్రత్యామ్నాయంగా సీమాంధ్ర ప్రాంతంలో మరో నగరాన్ని అభివృద్ధి చేయాలనే ప్రయత్నం చేయలేదు. సీమాంధ్రలో విశాఖ, కాకినాడ, విజయవాడ, తిరుపతి, కర్నూలు వంటి నగరాలకు అన్ని విధాలా అభివృద్ధి చెందే అవకాశాలున్నప్పటికీ ఏ ఒక్కరూ ప్రోత్సాహమందించలేదు. ఈ విషయంలో అందరికంటే పెద్ద తప్పు చేసింది మాజీముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే! విభజిత రాష్ట్ర ముఖ్యమంత్రిగా కాదు, సమైఖ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎక్కువకాలం పనిచేసింది చంద్రబాబునాయుడే! ఆయన పరిపాలించిన 1990 దశకంలోనే ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. సాఫ్ట్‌వేర్ రంగం వూపందుకుని నగరాలలో ఉద్యోగావకాశాలను పెంచింది అప్పుడే! ఆ గోల్డెన్ పిరియడ్‌లో చంద్రబాబుకు హైదరాబాద్ తప్పితే మరో లోకం లేకుండా పోయింది. సాఫ్ట్‌వేర్ కంపెనీలన్నీ హైదరాబాద్‌కు వచ్చేలా చేశాడేకాని, సీమాంధ్రలో సాఫ్ట్‌వేర్ పరంగా ఇంకో నగరాన్ని అభివృద్ధి చేద్దామనే ఆలోచన ఆయన చేయలేదు.

గత ఏడు దశాబ్దాలుగా రాష్ట్రంలో జరిగిందంతా అభివృద్ధి కేంద్రీకరణ. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రజల నుండి దండిన పన్నులతో హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుంటూ పోవడం... భవిష్యత్‌లో తెలంగాణ రాష్ట్రం విడిపోతే హైదరాబాద్ మనది కాకుండా పోతుందని, కాబట్టి హైదరాబాద్‌తో పాటు సీమాంధ్రలోనూ ఒకట్రెండు నగరాలను అభివృద్ధి చేద్దామనే ఆలోచనే మన సీమాంధ్ర ముఖ్యమంత్రులకు తట్టలేదు. రాష్ట్ర విభజన నాటికి ముఖ్యమంత్రులుగా పనిచేసిన వాళ్ళు సీమాంధ్ర ప్రాంతానికి ఎంత అన్యాయం చేశారో అర్థమైపోయింది. అప్పుడు ఎంత ఏడ్చినా లాభం లేని పరిస్థితి.

ఇక విభజన తర్వాత ఏర్పడ్డ నవ్యాంధ్ర రాజధాని విషయంలో తొలి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడైనా సరైన నిర్ణయం తీసుకున్నాడా అంటే అదీ లేదు. ఆయన అమరావతి కేంద్రంగా అభివృద్ధి కేంద్రీకరణకే మొగ్గుచూపాడు. ప్రతిదానికి అమరావతి అన్నాడు. ఇతర ప్రాంతాల ప్రజల్లో అసంతృప్తి రగిలేలా చేశాడు. అప్పటికీ జయప్రకాశ్ నారాయణ్ లాంటి మేధావులు హైదరాబాద్ విషయంలో చేసిన తప్పు మళ్ళీ చేయొద్దని హెచ్చరించారు. వాటిని చంద్రబాబు పెడచెవిన పెట్టి అమరావతి భజన చేశాడు.

దాని పర్యవసానాలేమిటో ఇప్పుడు చూస్తున్నాం. రాష్ట్ర విభజన జరిగిన ఆరో సంవత్సరంలోనే మళ్ళీ రాజధాని మార్పు.. విశాఖపట్నం కేంద్రంగా రాజధాని ఏర్పాటు చేసే ప్రయత్నాలలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వముంది. తెలుగు ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తొలినాళ్లలో రాజధాని విషయంలో నాయకులు వేసిన తప్పటడుగులు... ఇప్పటికీ మనల్ని తప్పుదారిలో నడిపిస్తూనే వున్నాయి.

## కామాక్షమ్మ ఆలయ ఛైర్మెన్‌గా రమేష్‌బాబు



జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ కామాక్షమ్మ అమ్మవారి ఆలయం ఛైర్మెన్‌గా చీమల రమేష్‌బాబు ఎన్నికయ్యారు. ఆలయ పాలకమండలిని నియమిస్తూ దేవాదాయశాఖ నుంచి గతనెల 30న ఉత్తర్వులు వచ్చాయి. ఆమేరకు చీమల రమేష్ బాబు, కె.మధుసూదన్‌రెడ్డి, గుమ్మా ప్రమీలమ్మ, పిడుగు సంగీత, బిందెల వెంకటరమణయ్య, సింగారెడ్డి సంగీతమ్మ, ఆములూరు విమల, తాతా ప్రభాకర్‌లను సభ్యులుగా, ఆలయ ఉప ప్రధానార్చకుడు శ్రీశైలం శశిశేఖర్‌శర్మను ఎక్స్ అఫిషియో సభ్యుడిగా నియమిస్తూ ఆదేశాలు వచ్చాయి. వీరంతా కలసి చీమల రమేష్ బాబును ఆలయ పాలకమండలి ఛైర్మెన్‌గా ఎన్నుకున్నారు.

### అమ్మవారికి హుండీ ద్వారా 27.14 లక్షల ఆదాయం

కామాక్షమ్మ ఆలయంలోని హుండీ కానుకలను గతనెల 30న లెక్కింపు జరపగా 27,14,769 రూపాయలు ఆదాయం వచ్చిందని ఆలయ ఇ.ఓ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. అక్టోబర్ 31 నుంచి ఇప్పటిదాకా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా ఆ మొత్తం వచ్చిందన్నారు. దేవాదాయశాఖ ఏ.సి వేగూరు రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

## హోటళ్లలో
## టీపీసీ మిషన్‌తో తనిఖీలు

నెల్లూరు జిల్లాలోని హోటళ్లలో ఆహార పధార్థాలు తయారు చేసే ప్రాంతాల్లో టోటల్ పోలార్ కౌంట్(టీపీసీ) అనే ప్రత్యేక మిషన్లు రానున్నాయని, వీటితో తనిఖీలు నిర్వహించనున్నామని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. నెల్లూరులోని తన కార్యాలయంలో గత నెల 30న విలేకర్లతో మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ అధికారుల లైసెన్స్‌లు ఉన్నవారు మాత్రమే ఆహార పదార్థాలను విక్రయించాలన్నారు. లైసెన్స్‌లు లేని వారికి లక్ష రూపాయలు జరిమానా విధిస్తామన్నారు. కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తే 98488 35889కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## 19 నుంచి పల్స్ పోలియో

**- ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలన్న కలెక్టర్**



జనవరి 19 నుంచి 21వ తేది వరకు జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం జరుగుతుందని, అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు పేర్కొన్నారు. గతనెల 30న అధికారులతో ఆయన సమావేశమై పల్స్‌పోలియో కార్యక్రమం ఏర్పాట్లపై చర్చించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం జరిగే మూడురోజులూ రవాణా సౌకర్యం, విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడాలన్నారు. జిల్లా వైద్యాధికారి డా. రాజ్యలక్ష్మి, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీమతి సుశీల, జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దనాచార్యులు తదితరులు పాల్గొన్నారు.




## వైజాగ్ బెటర్

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా విశాఖపట్నంను ఎంపిక చేయడం సముచిత నిర్ణయమే! హైదరాబాద్‌ను కోల్పోయిన మనకు రాష్ట్రంలో ఆ స్థాయిని అందుకోగల నగరంగా కనిపించేది విశాఖ పట్నమే. అన్ని కులాలు, మతాల వారు సమైక్యంగా జీవించే నగరం. ముఖ్యంగా పర్యాటకంగా, సినీ పరిశ్రమ పరంగా అభివృద్ధి చెందడానికి అవకాశమున్న నగరం. ఐటి ప్రాజెక్ట్‌లు రావడానికి కూడా అవకాశముంటుంది. అమరావతియే రాజధానిగా వుండుంటే ఎన్ని దశాబ్దాలైనా ఈ రంగాలు అభివృద్ధి చెందవు. అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనకే వేల కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఇప్పుడంత వ్యయం అవసరం లేకుండానే విశాఖపట్నంను పూర్తిస్థాయి రాజధానిగా అభివృద్ధి చేసుకోవచ్చు.

**– దంపూరు చెన్నకేశవులు, బద్వేలు.**

## హిందువులను గౌరవించండి

ఏ దేశంలో కూడా లేని విధంగా భారతదేశంలో మైనార్టీలకు హక్కులు, స్వేచ్ఛ ఉన్నాయి. ముఖ్యంగా కొన్ని ఇస్లామిక్ దేశాలలో మైనార్టీలు ఎంత అభద్రతా భావంతో బ్రతుకుతున్నారో చూస్తున్నాం. భారతదేశంలో మెజార్టీ హిందువులైనా మైనార్టీ ముస్లిం, క్రైస్తవ, సిక్కులైనా సోదరులుగానే బ్రతుకుతున్నారు. అయితే ఇంట్లో పెద్ద అన్నను తమ్ముళ్ళు ఎంతగా గౌరవిస్తారో, ఈ దేశంలో హిందూ సంస్కృతిని కూడా మైనార్టీలు గౌరవించాలి. ఇందుకోసం తమ సంస్కృతీ విధానాలను వదులుకోనవసరం లేదు. కాని, అలా గౌరవించకుండా హిందూ సంస్కృతి మీద దాడులు చేస్తూ, ఆ సంస్కృతిని నాశనం చేయాలని కొందరు చేస్తున్న ప్రయత్నాల వల్లే మతపరమైన వైషమ్యాలు పెరుగుతున్నాయి.

**– సి.రాజీవి, నెల్లూరు.**

## మాగాణి భూములు కాపాడుకోవాలి

మనం ఈ ప్రపంచంలో ఒక్క సెంటీమీటర్ కూడా అదనంగా సృష్టించలేనిది భూమినే! జనాభా ఎంత పెరిగినా వారి అవసరాలకు తగ్గట్లు ఇతర వస్తువుల ఉత్పత్తిని పెంచవచ్చునేమోగాని భూమిని పెంచలేము. అందులోనూ మంచి పంటలు పండే భూములను తయారు చేయలేము. అమరావతిలో రాజధాని పేరుతో 50వేల ఎకరాల పచ్చని పంటలు పండే మాగాణి భూములను నాశనం చేయాలని చూశాడు చంద్రబాబునాయుడు. ఇంకో ఐదేళ్లు ఆయనకే అధికారం ఇచ్చుండుంటే ఈ పొలాలు పూర్తిగా నాశనమయ్యేవి. వైసిపి అధికారంలోకి రావడం, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి విశాఖను రాజధానిగా నిర్ణయించడంతో ఈ పొలాల ద్వారా భావితరాలకు కూడా ఆహార ఉత్పత్తులను అందించే అవకాశం మిగిలింది.

**వి.పురుషోత్తం, ఒంగోలు.**

# నేతలరాతలను మార్చిన 2019

***2019... వెళ్లిపోయింది.... కాని ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చి, ఎందరో తల రాతలను మార్చి చరిత్రపుటల్లో తనకంటూ ఒక పేజీని మిగుల్చుకుని వెళ్లిపోయింది. జిల్లా రాజకీయాలకు సంబంధించి నంతవరకు 2019 ఒక చారిత్రాత్మక సంవత్సరమే. రాజకీయాలలో ఎన్నో అద్భుతాలను ఆవిష్కరించిన సంవత్సరం ఇదే! అగ్రభాగాన వున్న వారిని అట్టడుగుకు నెట్టి, అధఃపాతాళంలో వున్న వారికి అగ్ర తాంబూలం వేసిన సంవత్సరం ఇదే!***

☞ 2020 ఏం చేస్తుందో చూద్దాం...



2019 సంవత్సరంలోనే అధికారం తారుమారయ్యింది. నెల్లూరుజిల్లాలో క్లీన్‌స్వీప్ అయ్యింది. ఎన్టీఆర్ ప్రభంజనంలో కూడా ఈ రికార్డు సాధ్యం కాలేదు. తెలుగుదేశం పార్టీ పెట్టాక 9సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే ఒక్కసారి కూడా ఏ పార్టీకి క్లీన్‌స్వీప్ అన్నది సాధ్యం కాలేదు. కాని, తొలిసారి జిల్లాలో ఫ్యాన్ గుర్తు ఆ పని చేసింది. నెల్లూరు నగరం నుండి వరుసగా రెండోసారి పి.అనిల్‌కుమార్‌యాదవ్‌కు ఎమ్మెల్యేగా గెలిచే అవకాశం కల్పించింది ఆ సంవత్సరమే. అంతేగాక జిల్లాకు తొలి బి.సి మంత్రిగా అనిల్ రూపంలో అందించిందీ ఆ సంవత్సరమే! తెలుగుదేశం పార్టీ నెల్లూరు రూరల్ అభ్యర్థిగా ప్రచారం చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి సడెన్‌గా వైసిపిలోకి వెళ్లడం, నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా అఖండ విజయం సాధించిన అద్భుతఘట్టం ఆవిష్కృతమైంది ఈ సంవత్సరంలోనే!

గూడూరు తెలుగుదేశం టిక్కెట్ ఆశించిన బల్లి దుర్గాప్రసాద్‌కు చంద్రబాబు ఆ సీటు ఇచ్చుంటే ఇప్పుడు అందరు తెలుగుదేశం నాయకులతో చేరి 'అమరావతి'నే రాజధానిగా కొనసాగించాలనే ఆందోళనలలో పాల్గొంటుండేవాడు. ఆయనకు సీటివ్వకుండా చంద్రబాబు బల్లి నెత్తిన పాలు పోశాడు. వైసిపి వాళ్ళు పిలిచి తిరుపతి ఎంపి సీటివ్వడం, ఆడుతూ పాడుతూ గెలిచి పోవడం జరిగాయి. 2019 రాజకీయ నాయకుల టాప్ అదృష్టవంతులలో బల్లి ఒకడని వేరేగా చెప్పనవసరం లేదు. ఐదేళ్ళ రాజకీయ అనుభవంతోనే తన నాన్న, చిన్నాన్నలకు కూడా దక్కని మంత్రి పదవిని మేకపాటి గౌతంరెడ్డి దక్కించుకున్నది కూడా 2019లోనే! ఆనం రామనారాయణరెడ్డి వైసిపిలో చేరింది, వెంకటగిరి ఎమ్మెల్యేగా గెలిచింది ఆ యేడాదిలోనే! ఇక మిగిలిన వైసిపి ఎమ్మెల్యేలంటే వరుసగా రెండోసారి గెలిచినవాళ్ళున్నారు. అంతకంటే ఎక్కువ సార్లు గెలిచినవాళ్ళూ వున్నారు.

అదే సమయంలో 2019 కొందరికి మరచిపోలేని చేదు జ్ఞాపకాలను మిగిల్చింది. తన గెలుపు నల్లేరుపై నడకేననుకున్న పి.నారాయణను ఇంటికి పంపించింది, రాజకీయ చాణుక్యుడిగా పేరొందిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఖాతాలో ఐదో పరాజయాన్ని జమ చేసింది. వైసిపిలో కింగ్స్‌లా వుండాల్సిన కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డిల భవిష్యత్‌ను సందిగ్ధంలో పడేసింది. అన్నింటికి మించి 2019 పోతూపోతూ తెలుగుదేశంలో వున్న బీద మస్తాన్‌రావును వైసిపిలోకి నెట్టేసి వెళ్లిపోయింది.

ఇలా ఎందరి తలరాతలనో మార్చిన 2019 జిల్లా రాజకీయ నాయకులకు టాటా బైబై చెప్పేసి వెళ్లిపోయింది.

# పోర్టును సందర్శించిన ఎంపీలు



ఎంపి ఆదాలకు స్వాగతం పలుకుతున్న పోర్టు సిఇఓ అనిల్

నెల్లూరు, తిరుపతి, అనంతపురం పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బల్లి దుర్గాప్రసాద్‌రావు, తిలారి రంగయ్యలు గత నెల 29వ తేదీ కృష్ణపట్నం పోర్టును సందర్శించారు. ముగ్గురు ఎంపీలకు పోర్టు సిఇఓ ఎండ్లూరి అనిల్ కుమార్, పిఆర్ హెడ్ జి.వేణుగోపాల్, పోర్టు సెక్యూరిటీ చీఫ్ రాజేంద్రప్రసాద్‌లు ఘనస్వాగతం పలికారు. పోర్టు సెక్యూరిటీ అకాడమీ కేంద్రంలో రక్షణ సిబ్బంది పరేడ్‌ను, డాగ్‌స్క్వాడ్ విన్యాసాలను ఎంపీలు తిలకించారు. ఇప్పటివరకు పోర్టును సందర్శించిన ప్రముఖుల ఫోటోల ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి గతంలో సర్వేపల్లి ఎమ్మెల్యేగా వున్న తనకు కృష్ణపట్నం పోర్టుతో వున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నాడు. తాను ఎమ్మెల్యేగా వున్నప్పుడే తన నియోజకవర్గ పరిధిలో పోర్టు నిర్మాణం జరగడం, ప్రారంభం కావడం, వేలమందికి ఉపాధి అవకాశాలు కలగడం, చుట్టుపక్కల గ్రామాలు అభివృద్ధి చెందడం.. అంతా కూడా తన కళ్ల ముందే జరిగిందని ఆనందం వ్యక్తం చేశాడు. ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు పరిసర గ్రామాల ప్రజల యోగక్షేమాలు చూస్తూ పోర్టు యాజమాన్యం ఎంతో చక్కగా పనిచేస్తోందని అభినందించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, స్వర్ణా వెంకయ్య, అబూ బకర్, పాముల హరి, నరసింహరావు, సుధాకర్, డాక్టర్ సునీల్ వున్నారు.



పోర్టులో ఫోటో ప్రదర్శనను తిలకిస్తున్న పార్లమెంటు సభ్యులు ఆదాల, బల్లి

# స్ఫూర్తిదాయకంగా 'శ్రీసిటీ' సందర్శన

## - జాగృతి సంస్థ ఛైర్మెన్ శరత్ బన్సాల్



దేశంలోని వివిధ రాష్ట్రాలు, పలు విదేశాలకు చెందిన 450 మంది జాగృతి యాత్రా బృందం సభ్యులు గతనెల 30వ తేదీన శ్రీసిటీని సందర్శించడం విశేషం. ప్రత్యేక రైలుప్రయాణం ద్వారా ఈ జాగృతి యాత్ర గతనెల 24న ముంబై నుంచి ప్రారంభమైంది. 29న జిల్లాలోని తడ రైల్వేస్టేషన్‌కు చేరుకుని అక్కడ నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా శ్రీసిటీకి చేరుకున్న ఈ బృందానికి శ్రీసిటీ డైరెక్టర్ ముకుందరెడ్డి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్ వారికి శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి గురించి వివరించారు. ఈ సందర్భంగా జాగృతి సంస్థ ఛైర్మెన్ శరత్ బన్సాల్ మాట్లాడుతూ దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక ప్రాంతంగా ఎదుగుతున్న శ్రీసిటీని దర్శించడం తమ యాత్రా బృందానికెంతో స్ఫూర్తిదాయకమన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి నినాదమైన మేక్ ఇన్ ఇండియా, మేక్ ఇన్ ఆంధ్ర కలలకు ప్రతిరూపంగా దేశంలోని మెగా పారిశ్రామికవాడల్లో ఒకటిగా ఎదుగుతున్న శ్రీసిటీకి జాగృతి యాత్ర బృందం విచ్చేయడం సంతోషకర మన్నారు. శ్రీసిటీకి ఈ బృందం రావడం ఇది నాల్గవసారి అని, ఈ యాత్ర వారి జీవితాల్లో ఖచ్చితంగా మార్పు తీసుకు వస్తుందని ఆకాంక్షించారు. ముంబైలోని జాగృతి సేవా సంస్థాన్ 2008 నుంచి యువకులను ప్రోత్సహించి వారిని యువ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే ధ్యేయంతో జాగృతియాత్ర కార్యక్రమం నిర్వహిస్తోందని, పలు ప్రాంతాలను సందర్శించి అక్కడ ప్రముఖ పారిశ్రామికవేత్తలతో వీరికి సందేశాలివ్వడం జరుగుతోందని ఈ సందర్భంగా యాత్ర నిర్వాహకులు తెలిపారు. ఈ ఏడాది కూడా 12 ప్రాంతాలను సందర్శిస్తూ, 15 రోజుల యాత్ర నిర్వహిస్తున్నామన్నారు.







నెల్లూరు కబుర్లు

# ముక్కోటి ఏర్పాట్లు



ఉత్తర శ్రీరంగా పిలువబడే నెల్లూరు రంగనాయకులపేట లోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ఈ నెల 6వ తేదీ వైకుంఠ ఏకాదశి కోసం విస్తృతంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వైకుంఠ ఏకాదశి అంటేనే రంగనాయకులస్వామి గుడికి భక్తులు పోటెత్తినట్లు వస్తారు. సంవత్సరంలో ఆరోజున్నంత రద్దీ ఆ గుడిలో ఇంకెప్పుడూ వుండదు. కిలోమీటర్ల కొద్దీ భక్తులు క్యూలలో నిలబడి స్వామివారి దర్శనం చేసుకుని వెళుతుంటారు. ఈ ఏడాది కూడా సామాన్య భక్తులకు వీలైనంత త్వరగా దర్శనం కల్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రి పి. అనిల్‌కుమార్‌యాదవ్ ఆదివారం దేవస్థానాన్ని సందర్శించి ముక్కోటి ఏర్పాట్లపై అధికారులతో చర్చించాడు. ప్రతి ఏడాది 116 రూపాయలుగా వున్న విఐపి టిక్కెట్‌ను 500 రూపాయలు చేసి, ఇద్దరికి ప్రవేశం కల్పించారు. వృద్ధులు, వికలాంగులకు దర్శనం కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించారు.



## మూలాపేట శివాలయంలో
# మహా కుంభాభిషేకం

నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 24 నుండి 27వ తేదీ వరకు మహాకుంభాభిషేకం జరుగనుంది. భువనేశ్వరీ అమ్మవారి దేవస్థానం విమాన గోపుర కలశాల పునఃప్రతిష్ట 27వ తేదీ ఉదయం 9.10 గంటల నుండి 10.20 గంటల మధ్యలో జరుగుతుంది. 60 మంది వేదపండితులు మహాకుంభాభిషేక నిర్వహణకు విచ్చేస్తున్నారు. ఆలయంలో 12ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ సోమవారం ఆలయానికి విచ్చేసి దీనికి సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు. పుష్కరకాలం తర్వాత జరిగే మహా కుంభాభిషేక మహోత్సవాలను ఆధ్యాత్మిక వెలుగులు విరజిమ్మేలా నిర్వహించాలని కోరాడు.

## అక్రిడిటేషన్‌ల గడువు
# 6 నెలలు పొడిగింపు

రాష్ట్ర వ్యాప్తంగా వున్న జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గుర్తింపును మరో ఆరునెలలు పొడిగించారు. 2020 జనవరి 1 నుండి జూన్ 30వ తేదీ వరకు పాత అక్రిడిటేషన్ కార్డులే అమలులో వుంటాయి. ఈమేరకు సమాచార శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల అక్రిడిటేషన్‌ల మంజూరుకు అన్ని జిల్లాల్లో సవాలక్ష నిబంధనలతో దరఖాస్తులు స్వీకరించారు. ఈ తంతు ముగిశాక పాత వాటినే రెన్యూవల్ చేయమనడం విశేషం!

# వైసిపిలోకి మేకల

మొన్నటి ఎన్నికల ఫలితాల దెబ్బకు తెలుగుదేశంలో వున్న చిన్నచిన్న నాయకులు చెల్లాచెదురవుతున్నారు. వారంతా వైసిపి వైపుకు పరుగులు తీస్తున్నారు. ఈ పరంపరలోనే మాజీకార్పొరేటర్ మేకల రజనీ, ఆమె భర్త మేకల రాజేంద్రలు ఇటీవల మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిల సమక్షంలో వైసిపిలో చేరారు. అంటే సేఫ్‌జోన్‌లోకి అడుగుపెట్టారు.

# సమస్యలు పరిష్కరించండి
## - ఆదాల విజ్ఞప్తులపై స్పందించిన కలెక్టర్



నెల్లూరు లోక్‌సభ సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి గత నెల 28వతేదీ జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరి బాబును ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిశాడు. జిల్లాలో పలు ప్రాంతాలలో నెలకొన్న రైతుల సమస్యలను ఆదాల ప్రస్తావించగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించి వాటిని త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చాడు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డిలు పాల్గొన్నారు.

# ఎన్ఆర్‌సికి మద్దతుగా భారీ ర్యాలీ



కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టంకు మద్దతుగా సోమవారం నెల్లూరులో జాతీయవాదులు భారీ ర్యాలీ నిర్వహించారు. గాంధీ బొమ్మ నుండి మొదలైన ర్యాలీ ట్రంకు రోడ్డు, ఏ.సి సెంటర్, కనకమహల్ల మీదుగా తిరిగి గాంధీబొమ్మ వద్దకు చేరింది. జాతీయ వాదులు, యువతీ యువకులు పెద్దఎత్తున జాతీయ జెండాలు చేతపట్టి ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఆరెస్సెస్ రాష్ట్ర విభాగ్ ప్రధాన కార్యదర్శి యుగంధర్, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి, ఇంకా బీజేపీ, ఆరెస్సెస్, విహెచ్‌పి, భజరంగ్‌దళ్‌లకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. పౌరసత్వ సవరణ చట్టం ముస్లింలకు వ్యతిరేకం కాదని, భారతీయ ముస్లింలెవరూ దీని గురించి ఆందోళన చెందాల్సిన పనిలేదని ర్యాలీనుద్దేశించి ప్రసంగించిన నాయకులు పేర్కొన్నారు.

## లక్ష్మీ నరసింహుడి సాక్షిగా...
# అట్టహాసంగా ఇందుపూరు ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న పాలకమండలి సభ్యులు

నెల్లూరురూరల్ మండలం నరసింహపురంలోని శ్రీ వేదగిరి లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం పాలక మండలి ప్రమాణస్వీకారోత్సవం 29వ తేదీ అట్టహాసంగా జరిగింది. ఛైర్మెన్‌గా ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డితో పాటు సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్ కుమార్‌యాదవ్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు, నెల్లూరురూరల్ వైసిపి కార్యాలయ ఇన్‌ఛార్జ్ కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.వి. శేషగిరిబాబులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అనిల్ మాట్లాడుతూ స్వదేశీ దర్శన్ ద్వారా నరసింహకొండ దేవస్థానాన్ని అభివృద్ధి పరిచేందుకు 40కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపాడు. ప్రమాణస్వీకారానికి ముందు నెల్లూరు మూలాపేటలోని ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం వద్ద నుండి నరసింహకొండ వరకు భారీ ర్యాలీ జరిగింది. ఆలయ ఇఓ పోరెడ్డి శ్రీనివాసరెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించాడు.

## రైతులకు అందుబాటులో
# సహకార బ్యాంకు



నెల్లూరు జిల్లా రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ వారికి అందుబాటులో ఉంటామని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గతనెల 27న నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకు పాలకవర్గ సమావేశం డీసీసీబీలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రూ.2.08కోట్లు రుణాలిచ్చేందుకు తీర్మానించినట్లు తెలిపారు. బంగారు రుణాలకు సంబంధించి ఇదివరకు గ్రాముకు రూ.1900లు ఇచ్చేవారని, ఇప్పుడు దానిని రూ.2200లుకు పెంచినట్లు తెలిపారు. సీఈవో రమణారెడ్డి, డీసీవో తిరుపాల్‌రెడ్డి, నాబార్డు రవిసింగ్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

# మహిళా డిఎస్పీ బదిలీ

నెల్లూరు మహిళా పోలీస్‌స్టేషన్ డిఎస్పీ శ్రీధర్‌ను ఇంటలిజెన్స్ డిఎస్పీగా బదిలీ చేశారు. 2017 డిసెంబర్ 16వ తేదీ నుండి ఆయన మహిళా పోలీస్‌స్టేషన్ డిఎస్పీగా పని చేస్తున్నారు.

## విజయ డెయిరీ
# క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లూరు ఇస్కాన్ సిటీలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి డా. పి.అనిల్‌కుమార్‌యాదవ్ గతనెల30న విజయ డెయిరీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణమోహన్‌రెడ్డి, డైరెక్టర్ చెన్నూరు కృష్ణారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కృష్ణమోహన్. శివయ్య, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ కార్యాలయ ఇన్‌చార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అబ్కారీ మినిస్టీరియల్ ఉద్యోగుల
# నూతన కార్యవర్గం

అబ్కారీ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎంపిక గత నెల 27న నెల్లూరు ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ కార్యాలయంలో జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా సూపరింటెండెంట్ నళిని మోహన్, అధ్యక్షుడుగా గంగాధర్, జనరల్ సెక్రటరీగా శ్రీధర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గౌతమ్, జాయింట్ సెక్రటరీగా మునికుమార్, ట్రెజరర్‌గా సయ్యద్ మస్తాన్‌బాబు, మరో 5 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్నికయ్యారు.

## రూ.10,600 లంచం తీసుకుంటూ
# ఏసిబికి చిక్కిన ఏ.ఇ

చేసిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడానికి లంచం తీసుకుంటూ ఆర్‌డబ్ల్యూఎస్ ఏ.ఇ శ్రీనివాసులు ఏసిబి అధికారులకు పట్టుబడ్డ సంఘటన సోమవారం నెల్లూరు నగరంలో చోటుచేసుకుంది.

తిరుపాల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి అనేవాళ్ళు ఆర్‌డబ్ల్యూఎస్‌లో కాంట్రాక్ట్ పనులు చేస్తుంటారు. కలిగిరి మండలం వీర్నకల్లు గ్రామంలో మంచినీటి సరఫరా పనులకుగాను వీళ్ళకు 5.30లక్షలు బిల్లు రావాల్సివుంది. ఈ బిల్లు ఇవ్వాలంటే బిల్లు మొత్తంలో 2శాతం నగదును ఏ.ఇ శ్రీనివాసులు లంచంగా డిమాండ్ చేశాడు. దీంతో కాంట్రాక్టర్లు ఏసిబి అధికారులను ఆశ్రయించి విషయం చెప్పారు. వాళ్లు చెప్పిన ప్రకారం సోమవారం నెల్లూరు రామలింగాపురం జంక్షన్‌లోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి వెళ్లి ఏ.ఇ శ్రీనివాసులుకు 10,600 రూపాయలు లంచం ఇస్తుండగా అక్కడే మాటు వేసిన ఏసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసిబి డిఎస్పీ శాంత్రో ఆధ్వర్యంలో ఈ దాడి జరిగింది.

## క్రీడల్లో ముందంజ వేస్తున్న..
# కస్తూరిదేవి బాలికలు
## అభినందించిన కరెస్పాండెంట్ జె.వి.రెడ్డి

నెల్లూరులోని కస్తూరిదేవి బాలికల పాఠశాల విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోనూ ముందంజ వేస్తున్నారు. ఇటీవల గుంటూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో అండర్-14 విభాగం పోటీల్లో కస్తూరిదేవి ఎయిడెడ్ పాఠశాలకు చెందిన శైలజ, తులసి, రిషిక తమ క్రీడాప్రతిభను చాటుకుంటూ ప్రథమస్థానంలో నిలిచి బహుమతులందుకున్నారు. అదేవిధంగా ప్రకాశం జిల్లాలో జరిగిన అండర్-17 విభాగం ఖోఖో జట్టులో ఈ పాఠశాలకు చెందిన సాయిలక్ష్మి ప్రథమ బహుమతిని సాధించి అందరి ప్రశంసలు అందుకుంది. రాష్ట్రస్థాయిలో వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లోనూ ఈ పాఠశాల బాలిక గంగోత్రి తృతీయస్థానం సాధించింది. విజేతలందరినీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కరెస్పాండెంట్ జె.వి. రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వనజ, పిఇటి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# పేదల వైద్యానికి పెద్దపీట

## 'సఖి' వన్‌స్టాప్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రులు



నెల్లూరు నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 48.70 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సఖి వన్‌స్టాప్ సెంటర్‌కు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబసంక్షేమం, వైద్యవిద్య శాఖల ఉపముఖ్యమంత్రి ఆళ్ళ శ్రీనివాస్ గతనెల 30న ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్యారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్‌లో 12వేల కోట్ల రూపాయలు కేటాయించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వాసుపత్రుల్లో ఖాళీగా ఉన్న 4వేల డాక్టర్లు, సిబ్బంది భర్తీకి సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర ముఖ్యమంత్రికి పంపామన్నారు. వచ్చే మే నెలలో అన్ని ఖాళీలను భర్తీచేస్తామని సిఎం హామీ ఇచ్చారన్నారు. అనంతరం ఆయన ఆసుపత్రిలోని పలు విభాగాలను సందర్శించి రోగులను పరామర్శించి వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అవసరమైన సదుపాయాల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబసంక్షేమ శాఖల కమిషనర్ కార్తికేయమిశ్రాతో పాటు డైరెక్టర్ అరుణ కుమారి, వైద్యవిద్య డైరెక్టర్ వెంకటేష్, జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు, వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

### క్యాన్సర్ ఆసుపత్రిని జిల్లాకు రప్పించాలి - మంత్రి డాక్టర్ అనిల్

జిల్లాలో పాతికవేల మంది దాకా ప్రజలు క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు అంచనాలున్నాయని, ఈ నేపథ్యంలో కేంద్రం నిధులు 48 కోట్ల రూపాయలతో జిల్లాకు క్యాన్సర్ ఆసుపత్రి మంజూరైనప్పటికీ, కొన్ని రాజకీయ కారణాల వల్ల అది జిల్లాకు రాకుండా పోయిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. గతంలో అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి తన ప్రైవేట్ మెడికల్ కళాశాలకు ఇబ్బంది వస్తుందని ఇక్కడ క్యాన్సర్ ఆసుపత్రి నెలకొల్పకుండా అడ్డుకున్నారని, దీంతో అది వైజాగ్‌కు తరలిపోయిందని, రామచంద్రారెడ్డి ఆసుపత్రి డాక్టర్లు, మెడికల్ కళాశాల డాక్టర్లు క్యాన్సర్ ఆసుపత్రిని నిలుపుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందన్నాడు. ముఖ్యమంత్రితో మాట్లాడి నెల్లూరుకు క్యాన్సర్ ఆసుపత్రి వచ్చేలా కృషి చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తూ హాజరుపట్టీలో సంతకం చేసి ప్రైవేట్ నర్సింగ్‌హోంకు వెళ్ళే వైద్యులను సస్పెండ్ చేయాలన్నారు. వైద్యవృత్తి ఎంతో పవిత్రమైందని అంటూ జీతం సరిపోకపోతే ఎంతకావాలో వైద్యులు కోరాలన్నారు.



# ఇండోర్ షటిల్ కోర్టును ప్రారంభించిన విపిఆర్



రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇటీవల నెల్లూరు నగరంలోని రీడింగ్‌రూమ్ అండ్ మెక్లిన్స్ లైబ్రరీలో స్వర్గీయ రేబాల విజయకుమార్‌రెడ్డి మెమోరియల్ ఇండోర్ షటిల్ ఉడన్‌కోర్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత దేవిరెడ్డి మల్లికార్జునరెడ్డిని ఆయన అభినందించారు. అనంతరం విపిఆర్ మాట్లాడుతూ గతంలో చాలామంది ప్రముఖులు ఇక్కడ సభ్యులుగా ఉండేవారని, మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో నగరానికి నడిబొడ్డున ఉన్న ఈ రీడింగ్‌రూమ్‌లో ఇంకా అవసరమైన మేరకు వసతులు ఏర్పాటు చేసుకోవాల్సి ఉందని, అందుకు తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. ఆ తర్వాత ఆయన కాసేపు సరదాగా షటిల్ ఆడి ఆహ్లాదంగా గడిపారు. ఈ కార్యక్రమంలో సుధీర్‌రెడ్డి, మేనకూరు సీతారామిరెడ్డి, వేమిరెడ్డి కోటారెడ్డి, ఎస్‌వి రమణయ్య, కెవిఆర్ ప్రభాకర్‌రెడ్డి, హరేంద్రనాథ్‌రెడ్డి, ఏ.విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

# చెంగాళమ్మ సేవకు బాలచంద్రుడు

## కొత్త పాలకవర్గం ప్రమాణస్వీకారం



వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో సీనియర్ నాయకుడు, నెలబల్లి మాజీ సొసైటీ అధ్యక్షుడు దువ్వూరు బాలచంద్రారెడ్డి సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఛైర్మెన్‌గా గత నెల 27వ తేదీన ప్రమాణస్వీకారం చేశాడు. ఆరోజు ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య సమక్షంలో దేవస్థాన నూతన పాలక మండలి ప్రమాణస్వీకారం జరిగింది. దువ్వూరు బాలచంద్రారెడ్డితో పాటు సభ్యులుగా గోగుల గోపాల్, కర్లపూడి మదన్‌మోహన్, మద్దూరు శారద, మునగా అమరావతి, తాటిపర్తి వాణి, పొన్నా నాగమ్మ, కామిరెడ్డి రేవతి, సుధ, ఎక్స్ అఫిషియో సభ్యులుగా చౌకరపల్లి నరేంద్రలు ప్రమాణస్వీకారం చేశారు. నూతన పాలకవర్గాన్ని ఎమ్మెల్యే సంజీవయ్య అభినందిస్తూ, ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని, ఆలయ పవిత్రతను కాపాడుతూ భక్తులకు సేవలందించాలని కోరారు. దువ్వూరు బాలచంద్రారెడ్డి వైసిపిలో క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా అందరికీ సుపరిచితుడని, నిస్వార్థంతో అందరి మన్ననలు పొందేలా సేవ చేస్తాడని భావించే ఆయనకు ఈ బాధ్యత అప్పగించడం జరిగిందన్నాడు. దేవాలయంలో జరిగే అన్ని కార్యక్రమాలలో కూడా సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని, చెంగాళమ్మ ఆశీస్సులతో దేవస్థానం అభివృద్ధికి అందరం నడుం కడదామన్నాడు. అమ్మణ్ణికి సేవ చేసుకునే అదృష్టం కల్పించినందుకు పాలకమండలి సభ్యులంతా కూడా ఎమ్మెల్యేకు కొతజ్ఞతలు తెలిపారు.

ఆలయ ఇ.ఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో వైసిపి నాయకులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, కట్టా సుధాకర్‌రెడ్డి, కళత్తూరు రామ్మోహన్‌రెడ్డి, దబ్బల శ్రీకాంత్‌రెడ్డి, జెట్టి వేణు, అలవల సురేష్, అయితా శ్రీధర్, కలత్తూరు శేఖర్‌రెడ్డి, అల్లూరు అనిల్‌రెడ్డి, షేక్ రఫి తదితరులు పాల్గొన్నారు.

# వైసిపిలో ఇమిడిపోతున్న బిఎంఆర్

ఇటీవలే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరిన మాజీశాసన సభ్యులు బీద మస్తాన్‌రావు క్రమంగా ఆ పార్టీలో ఇమిడిపోతున్నాడు. పార్టీలో చేరాక జిల్లాకు వచ్చిన ఆయన మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్‌ను, ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని, మాజీఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డిని, జిల్లాలోని పలువురు వైసిపి శాసన సభ్యులను మర్యాదపూర్వకంగా కలిశాడు. అంతేకాదు, పార్టీ పరంగా జరిగే కార్యక్రమాలలోనూ, ప్రభుత్వపరంగా జరిగే కార్యక్రమాలలోనూ చురుకుగా పాల్గొంటున్నాడు.


ఎంపి ఆదాలతో బిఎంఆర్


కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నను కలిసిన బీద మస్తాన్‌రావు


మా క్లయింట్లకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు,
గూడూరు ప్రాంత ప్రజానీకానికి
2020 నూతన సంవత్సర
మరియు
సంక్రాంతి శుభాకాంక్షలు.
S. RAMA MOHAN RAO,
B.Com., FCA
S.V. Ratnam & Co.,
Chartered Accountants
13/160, Thyagaraja Street, Gudur - 524 101,
Nellore Dist., A.P. Tel: 08624 - 52143.





అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



శుభాకాంక్షలు
గూడూరు పట్టణ,
పరిసర ప్రాంతాల ప్రజానీకానికి
2020 నూతన సంవత్సర
మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.
శ్రీశ్రీశ్రీ గంగమ్మ పరమేశ్వరి దేవి
దేవస్థాన ఆలయ కమిటీ
మరియు
గూడూరు నియోజకవర్గ యాదవ సోదరులు






# గూడూరు డివిజన్ వార్తలు

## ప్రభుత్వ స్టేడియంలో
# జిమ్ పరికరాలకు నిధులివ్వండి



బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో జిమ్ పరికరాలకు నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరుతూ ఆదివారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ నరసప్పకు ఎమ్మెల్యే వరప్రసాదరావు వినతిపత్రాన్ని అందజేశాడు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు సతీష్‌రెడ్డి, మోడిబోయిన సుబ్రహ్మణ్యం, చిరంజీవి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయితీరాజ్ శాఖకు
# ఇతర శాఖల పనులు కేటాయించవద్దు




సమావేశంలో మాట్లాడుతున్న షేక్ రియాజ్‌అహ్మద్

ఏ శాఖకు సంబంధించిన పనులు ఆ శాఖకే కేటాయించడం వల్ల పనులు వేగంగా జరుగుతాయని, ఇతర శాఖ పనులు పంచాయితీరాజ్ శాఖకు కేటాయించవద్దని ఏపి పంచాయితీరాజ్ డిప్లొమా ఇంజనీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ తెలిపాడు. విజయవాడలోని ఏపిఎన్‌జివో కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపాడు. ఇంజనీర్ల కొరత ఉండటంతో శాఖా పరమైన పనులకే ఉద్యోగులు ఇబ్బంది పడాల్సి వస్తోందని తెలియజేశాడు. ప్రభుత్వం సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఇతర శాఖల పనులు కేటాయించకుండా ఉండాలని తెలిపాడు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు హనుమంతరావు, కేశవులు, రాంబాబు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## గీతా పఠనంతో
# మానసిక వికాసం



బహుమతులందజేస్తున్న విహెచ్‌పి ప్రతినిధులు

చిన్నతనం నుంచి భక్తి మార్గాన్ని అనుసరించడం ద్వారా భగవద్గీత పఠించడం సులభమవుతుందని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు ప్రజేంద్రరెడ్డి తెలిపాడు. గూడూరు పట్టణంలోని సరస్వతి శిశుమందిరంలో ఆదివారం విహెచ్‌పి ఆధ్వర్యంలో భగవద్గీత కంఠస్థ పోటీలను నిర్వహించారు. గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని ఎంతోమంది మేధావులు భగవద్గీత గొప్పతనాన్ని తెలుసుకొని, మానసిక వికాసాన్ని పొందుతున్నారని తెలిపాడు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పి ప్రతినిధులు ఆర్‌వి రావు, రామయ్య, మురళీనాయుడు, కార్యదర్శి కడివేటి రామమూర్తి, మనోజ్ కుమార్, చిన్న, శ్యామ్, మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిఏఏ రద్దుకు డిమాండ్




ర్యాలీలో పాల్గొన్న ముస్లిం సోదరులు

సిఏఏ, ఎన్‌పిఆర్ చట్టాల్ని రద్దు చేయాలని, కేంద్రం తీసుకొన్న నిర్ణయంతో ముస్లిం సోదరులు పౌరసత్వాన్ని నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే వరప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు.

గూడూరు పట్టణంలోని ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ పురవీధుల్లో పలు పార్టీల నాయకులు, ముస్లిం సోదరులతో కలిసి హిందూ ముస్లిం భాయీభాయీ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి చట్టాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. సిఏఏ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, ముస్లిం సంఘాలు, నాయకులు యాదగిరి, కాలేషా, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, చేవూరి విజయమోహన్‌రెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, నాశిన నాగులు, బొమ్మిడి శ్రీనివాసులు, మగ్దూమ్, అన్వర్, జహంగీర్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

# చోరీ కేసులో నిందితుల అరెస్ట్

**రూరల్ సిఐ రామకృష్ణారెడ్డి**



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న రూరల్ సిఐ రామకృష్ణారెడ్డి

గూడూరు, నాయుడుపేట ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రూ.లక్ష నగదు, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు గూడూరు రూరల్ సిఐ రామకృష్ణారెడ్డి తెలిపాడు. గూడూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం పట్టణ సమీపంలోని ఓ షోరూం వద్ద కారు అద్దాలు పగలకొట్టి దొంగతనం చేసిన కేసుకు సంబంధించి వివరాలు వెల్లడించాడు.

సిఐ తెలిపిన వివరాల మేరకు బోగోలు మండలం కప్పరాళ్ళతిప్ప ప్రాంతానికి చెందిన తుపాకుల అనూప్‌కుమార్, తుపాకుల ప్రభుదాస్ వారం రోజుల క్రితం గూడూరు పట్టణ సమీపంలోని జాతీయ రహదారి ప్రాంతంలో ఉన్న హోండా షోరూం వద్ద భరత్‌బాబు అనే వ్యక్తి కారులో ఉన్న నగదును, ల్యాప్‌టాప్‌ను, ఇతర వస్తువులను కారు అద్దాలు పగలకొట్టి దొంగలించి పరారయ్యారు. ఈ కేసుకు సంబంధించి నిందితుల వివరాలను సిసి కెమెరాల నుంచి సేకరించారు. ఈ ఇద్దరు గతంలో కూడా నాయుడుపేట ప్రాంతంలో ఇదే తరహా దొంగతనాలకు పాల్పడినట్లు చెప్పాడు. ఈ క్రమంలో రూరల్ ఎస్సై పుల్లారావు, సిబ్బంది జాతీయ రహదారి వద్ద నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.లక్ష నగదు, ల్యాప్‌టాప్‌ను పలు పత్రాలను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచినట్లు తెలిపాడు. ఈ కార్యక్రమంలో ఆర్.వెంకటేశ్వర్లురాజు, నావూరయ్య, ఆదినారాయణ, మాధవ్‌రావు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.





















# ముందస్తు జాగ్రత్తలతో క్యాన్సర్ దూరం

**- డాక్టర్ యస్.రాజాసుందరం**



ప్రస్తుత కాలంలో క్యాన్సర్ పలు రకాలుగా పెరుగుతుందని, దానికి నివారణగా ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ క్యాన్సర్ వ్యాధుల శస్త్ర చికిత్సా వైద్య నిపుణులు ప్రొఫెసర్ డా. యస్.రాజా సుందరం సూచించారు. గత నెల 28న నెల్లూరు గ్లోబల్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్ , గర్భాశయ క్యాన్సర్, బ్రెయిన్ క్యాన్సర్, పేగు క్యాన్సర్‌లను ముందస్తుగానే గుర్తించినట్లయితే తగు చికిత్స ద్వారా వాటి నుంచి బయట పడవచ్చన్నారు. అనువంశికత ద్వారా వచ్చే క్యాన్సర్‌లు కొన్నయితే, ఆహారపు అలవాట్ల ద్వారా వచ్చేవి కొన్నన్నారు. తాను చెన్నై గ్లోబల్ హాస్పిటల్‌లో క్యాన్సర్ వ్యాధి డిపార్ట్‌మెంట్‌కు డైరెక్టర్‌గా ఉన్నట్లు పేర్కొన్నారు. అన్ని రకాల క్యాన్సర్లకు సంబంధించి తమ హాస్పిటల్‌లో పూర్తిస్థాయి ట్రీట్‌మెంట్ లభ్యమవు తుందని, అత్యాధునిక వైద్య పరికరాలు తమ హాస్పిటల్‌లో ఉన్నాయన్నారు. గ్లోబల్ హాస్పిటల్ వైస్ ప్రెసిడెంట్ వి.భాస్కరరెడ్డి మాట్లాడుతూ అడయార్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ తరహాలో తమ హాస్పిటల్‌లో క్యాన్సర్ విభాగం పనిచేస్తుందని, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో గ్లోబల్ హాస్పిటల్ మేనేజర్ జి.రవికుమార్ పాల్గొన్నారు.

# షార్‌లో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)కు గతనెల 27 న సైన్స్ అండ్ టెక్నాలజీ, అటవీ, పర్యావరణ, వాతావరణ శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు విచ్చేశారు. కమిటీ ఛైర్మన్ జైరాం రమేష్ ఆధ్వర్యంలో 10 మంది రాజ్యసభ, 21 మంది లోక్‌సభ సభ్యుల బృందం షార్ లో పర్యటించింది. వీరికి షార్ సంచాలకులు ఆర్ముగం రాజరాజన్, నియంత్రణాధికారి రంగనాథన్ స్వాగతం పలికారు. అనంతరం నక్షత్ర అతిథి భవనంలోని కాన్ఫరెన్స్ హాలులో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కార్యక్రమాలపై వివరించారు. కమిటీ సభ్యులు షార్ లోని ప్రయోగ వేదికలు, మిషన్ కంట్రోల్ సెంటర్ తదితర ముఖ్య విభాగాలను సందర్శించారు.

### ఉగాది నాటికి రాష్ట్రంలో...

# 25 లక్షల మందికి ఇళ్ళ పట్టాలు

**- ఉప ముఖ్యమంత్రి పిల్లి సుభాష్‌చంద్రబోస్**



ఉగాది నాటికి రాష్ట్రంలోని 25 లక్షల మంది పేదలకు ఇళ్ళ పట్టాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. గతనెల 28న నెల్లూరులో నూతన జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రెవెన్యూ రికార్డుల నవీకరణ విధానాన్ని ముఖ్యమంత్రి చేపట్టారని, ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర సర్వే నిర్వహిస్తామని, దీనివల్ల అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట పడుతుందని అన్నారు. ఈనాం భూములు, చుక్కల భూముల సమస్యలను సిఎం దృష్టికి తీసుకువెళ్ళి తగు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి సిహెచ్ రంగనాథరాజు మాట్లాడుతూ జిల్లాలో 1,78,174 మంది పేదలకు ఇళ్ళు లేవని, వారందరికీ గృహనిర్మాణం కోసం 2,853.80 ఎకరాల స్థలం అవసరమని, ఇప్పటికే 2,478 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని, ఉగాది నాటికి జిల్లాలో అర్హులైన వారందరికీ ఇళ్ళ పట్టాలు అందిస్తామని తెలిపారు.

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా. అనిల్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇళ్ళ నిర్మాణం పేరుతో అనేక అక్రమాలు జరిగాయని, రివర్స్ టెండరింగ్ ద్వారా ప్రభుత్వానికి డబ్బు మిగిలేలా చర్యలు తీసుకుని, లబ్దిదారులకు కూడా న్యాయం చేస్తామని అన్నారు. పట్టణాల్లోని పేదలకు అపార్ట్‌మెంట్స్‌లో కాకుండా ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని సిఎం నిర్ణయించారన్నారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వెలగపల్లి వరప్రసాద్, కిలివేటి సంజీవయ్యతో పాటు భూ పరిపాలన ముఖ్యకార్యదర్శి కెఆర్‌బి హెచ్ఎస్ చక్రవర్తి, కలెక్టర్ ఎంవి శేషగిరి బాబు, జేసీ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

# అయ్యప్పస్వామికి చందనాభిషేకం



నెల్లూరు వేదాయపాళెంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో గతనెల 27న స్వామివారికి ఎంతో భక్తిశ్రద్ధలతో చందనాభిషేకం నిర్వహించారు. ఉభయకర్తలు శేషగిరిరావు, చెంచలాదేవి, డాక్టర్ నరసింహారెడ్డి, విజయమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మండల పూజోత్సవాల్లో భాగంగా స్వామివారికి విశేష పూజలు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో ఈ వేడుకలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

శ్రీను గల్పిక

# లోకేష్ లాజిక్‌తో రాజధాని సమస్యకు పరిష్కారం

అది విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం. రాష్ట్ర రాజధాని విషయంలో పంచాయితీ పెట్టారు. రౌండ్ టేబుల్ సమావేశానికి గుర్తుగా ఒక గుండ్రటి టేబుల్ వేసి దాని చుట్టూ కుర్చీలు వేశారు. ఉదయం 10గంటలకు పంచాయితీ అని ముందుగానే ప్రభుత్వంవైపు నుండి టైం అనౌన్స్ చేయడంతో 9.45గంటల కల్లా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి, ప్రతిపక్ష నేత, హైటెక్‌రత్న చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, వామపక్షాల నుండి రామకృష్ణ, చికెన్ నారాయణలతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, రాష్ట్రంలోని 13జిల్లాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు వచ్చి కూర్చున్నారు. అక్కడి పంచాయితీకి కూడా స్పీకర్ తమ్మినేని సీతారాం పెద్దమనిషి పాత్ర పోషిస్తూ... చెప్పండి.. రాజధాని విషయంలో ఎవరి అభిప్రాయాలు వాళ్ళు అని కోరాడు. మొదట చంద్రబాబు అందుకుని... మేం అమరావతి రాజధానిని డిసైడ్ చేశాం... రైతుల నుండి 33వేల ఎకరాల భూమిని సేకరించాం... అమరావతి అలావుండాలి, ఇలా వుండాలి అని చెప్పి ఎన్నో కలలు కన్నాను... ఆ కలలను ఛిద్రం చేస్తారా? నా ఆశయాలను విచ్ఛిన్నం చేస్తారా... అంటూ ఆవేశంగా అరిచాడు. వెంటనే అంబటి రాంబాబు వుండి... కలలు కంటుంటే రాజధానులు పూర్తికావు చంద్రబాబు గారు.. నేను కూడా కత్రినాకైఫ్‌తో డ్యూయెట్ వేసుకున్నట్లు కలగంటాను... నిజమైపోద్దా... మాకు కావాల్సింది కలల రాజధాని కాదు, కలర్‌ఫుల్ రాజధాని, అందుకే విశాఖపట్నంకు పోవాలనుకుంటున్నామన్నాడు. అప్పుడు జగన్ కలుగజేసుకుని... నువ్వుండు రాంబాబు, నేను మాట్లాడుతా కదా అని వారించి... చూడండి చంద్రబాబు గారు... మీరు ఐదేళ్ల అమరావతి పాటనే పాడారు, కాని మేము మాత్రం అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలనుకుంటున్నాం... అందుకే మూడు ప్రాంతాలలో మూడు రాజధానుల కాన్సెప్ట్‌ను తీసుకొచ్చాం... మీరు కూడా భ్రమలను వదిలి ఈ కాన్సెప్ట్‌ను స్వాగతించండి అని కోరాడు. వెంటనే సుజనాచౌదరి లేచి.... ఆయన ఒప్పుకున్నా, మేం ఒప్పుకోం... అమరావతినే రాజధానిగా కొనసాగించాల్సిందే అని అరిచాడు. అప్పుడు మంత్రి పి.అనిల్ కుమార్‌యాదవ్ లేచి... నువ్వు అడగతానే ఒప్పుకోవడానికి మేం పప్పులం కాదు... నిప్పుకణికలం... మా జగనన్న ఏది చెబితే అదే రాజధాని అని ఆవేశంగా అన్నాడు. అక్కడే వున్న పి.నారాయణ... నిన్నగాక మొన్నచ్చావ్... నువ్వు కూడా రాజధానిపై సలహాలిస్తావా అని వెటకారంగా అన్నాడు. దానికి వెంటనే అనిల్ స్పందిస్తూ... ఎప్పుడొచ్చామా అన్నది ముఖ్యం కాదు అన్నయ్యా.... బుల్లెట్ దిగిందా లేదా అన్నదే ముఖ్యం... ఈ సంగతి మీకు బాగానే తెలుసనుకుంటా... అని అన్నాడు. జగన్ కలుగజేసుకుని అనిల్‌ను కూర్చోమన్నాడు. జేసీ దివాకర్ రెడ్డి లేచి... రాజధాని మీద ఈ పంచాయితీ అంతా ఎందుకబ్బా... మాది ఎంత వెనుకబడిన ప్రాంతమో మీకందరికీ తెలుసు, కాబట్టి అనంతపురంను రాజధానిగా చేయండి, మేం బస్సులు కూడా ఇంకోచోట తిప్పుకోవాల్సిన పని లేదు అని అన్నాడు. వెంటనే ధర్మాన కృష్ణదాస్ లేచి... మీది వెనుకబడిన జిల్లా అయితే మాది ముందుబడిన జిల్లానా... మా శ్రీకాకుళం వెనుకబడే వుంది, కాబట్టి శ్రీకాకుళంను క్యాపిటల్‌గా చేస్తే ఏ తలనొప్పి వుండదు అని చెప్పాడు. అది విని జక్కంపూడి రాజా లేచి... మా తూర్పుగోదావరి జిల్లా మాత్రం ఏం పాపం చేసింది, రాజమండ్రి, కాకినాడ, అమలాపురం, పెద్దాపురం వంటి అందమైన పట్టణాలున్నాయి, కోనసీమకు ప్రత్యేక పేరుంది. సంక్రాంతి పండుగలప్పుడు అందరూ వచ్చి కోడిపందేలు ఆడుకోవచ్చు... కాబట్టి మా తూర్పు గోదావరి జిల్లాలో రాజధాని పెడితే మీ అందరికీ కూడా మంచిదేనన్నాడు. మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వుండి... రాజధాని కాన్సెప్ట్.. అభివృద్ధి చెందిన నగరాలను ఇంకొంచెం అభివృద్ధి చేయడానికి కాదు, వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి... మా ఒంగోలులో రాజధాని పెట్టండి... అప్పుడు సంక్రాంతికి కోళ్లపందేలు కాదు, ఏకంగా ఒంగోలు గిత్తలతో ఎద్దుల పందేలే పెట్టుకోవచ్చు అని చెప్పాడు. అప్పుడు మంత్రి పి.అనిల్ కుమార్‌యాదవ్ కలుగజేసుకుని... అక్కడా ఇక్కడా ఎందుకు... మా నెల్లూరులో రాజధాని పెట్టండి... అందరూ హ్యాపీగా వుంటారు అని ప్రతిపాదించాడు. మీ నెల్లూరులో ఏం గొప్ప వుందని రాజధాని పెట్టాలంటూ గోరంట్ల బుచ్చయ్యచౌదరి, అచ్చెన్నాయుడు, జేసీ దివాకర్‌రెడ్డి, జక్కంపూడి రాజాలు కోరస్‌గా అడిగారు. మీ జిల్లాల్లో లేని అమూల్యసంపద మా జిల్లాలోనే వుందని అనిల్ అన్నాడు. ఏంటా సంపద అని వాళ్ళు మళ్ళీ కోరస్‌గా అడిగారు. దానికి అనిల్... ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలు, మీ జిల్లాల్లో వీటిని చూపగలరా, అరుదైన ఈ జీవులను అభివృద్ధి చేయడానికి తరతరాలుగా మా నగరపాలక సంస్థ పాలకులు ఎంత కృషి చేశారో తెలుసా.... అమెరికా, జపాన్, ఫ్రాన్స్ లాంటి దేశాలు కూడా ఈరోజు నెల్లూరు వైపు చూస్తున్నాయి, ఈ దోమలు వున్న ప్రాంతం వైపు శత్రు దేశాలు కన్నెత్తి కూడా చూడవు. నెల్లూరుకు రక్షణ కవచంలా ఈ ముదురుదోమలున్నాయి. కాబట్టి రాజధానిగా నెల్లూరే అన్ని విధాలా సేఫ్ అని చెప్పి కూర్చున్నాడు.

అంతలో అక్కడ కూర్చున్న అందరి మధ్యలో నుండి... ఈ తొక్కలో మీటింగ్ లేంది నాన్నారు... మొత్తం వందమంది వుంటారేమో... ఒక బాంబుతో లేపేస్తే పోలా... అనే మాటలు దూసుకొచ్చాయి. ఆ మాటలకు అందరూ నిర్ఘాంతపోయారు. ఆ మాటలు వచ్చిన వైపుకు చూశారు, అక్కడ ఒక కుర్చీలో లోకేష్... 'పోకిరి' సినిమాలో మహేష్‌బాబు లెవల్లో కూర్చుని వున్నాడు. దేవినేని ఉమామహేశ్వరరావు భయంతో అతనివద్దకెళ్ళి... రేయ్ మెంటల్... ఏమనుకుంటున్నావురా, బాంబు వేసి వందమందిని లేపడమేంటిరా అని అన్నాడు. అప్పుడు చంద్రబాబు జోక్యం చేసుకుని, ఉమా... నువ్వు మరీ అంత ఎక్సయిట్‌మెంట్ కామాకు, వాడు బాంబు అన్నది ఫ్యాక్షన్ గొడవల్లో వేసే బాంబు కాదులే... కడుపులో జరిగే యాక్షన్ వల్ల వచ్చే బాంబు... అలాంటివి వస్తే ఇక్కడున్న వారంతా చెల్లాచెదురు కావాల్సిందే... కాకపోతే ప్రాణహాని వుండదు, అని సముదాయించాడు.

స్పీకర్ తమ్మినేని సీతారాం వుండి... వైసిపి వాళ్లేమో అమరావతి వద్దు, వైజాగ్ ముద్దు అంటున్నారు, టిడిపివాళ్లేమో మూడు రాజధానులు వద్దు అమరావతి ముద్దు అంటున్నారు. ఈ పంచాయితీ తెగేదెలా అని అన్నాడు. అప్పుడు లోకేష్ వుండి... దీనికి పరిష్కారం నా వద్ద వుంది, వింటారా అని ప్రశ్నించాడు. ఏంటది అని అందరూ అడిగారు. వైసిపివాళ్ళను ఉద్దేశించి మీకు విశాఖపట్నంలో రాజధాని వుండాలి అంతేనా.. అని ప్రశ్నించాడు. దానికి వాళ్ళు అవును అని చెప్పారు. లోకేష్ టిడిపి వాళ్ళవైపు తిరిగి మీకు అమరావతి రాజధానిగా వుండాలి అంతేగా అని ప్రశ్నించాడు. వాళ్ళు కూడా అవుననే సమాధానమిచ్చారు. అప్పుడు లోకేష్ ఇది చాలా సింపుల్.. విశాఖపట్నంకు అమరావతి అని పేరు పెట్టండి... వాళ్ళ ప్రాంతంలో రాజధాని వుంటుంది... మీరు కోరినట్లు రాజధానికి అమరావతి పేరు వుంటుందని చెప్పాడు. ఆ లాజిక్ వినగానే గుంటూరు, కృష్ణా జిల్లాల తెలుగుదేశం నాయకులు దగ్గర్లో కర్రలేమన్నా వున్నాయేమోనని వెదకశాగారు.

## సాయి దర్బార్‌లో..
# కొత్త సంవత్సర పూజలు



నెల్లూరు బాలాజీనగర్, పద్మావతినగర్‌లోని అద్దాల సాయిబాబా మందిరంలో నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిరాన్ని ఆకర్షణీయంగా అలంకరించారు. ఆరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు సాయినామ సంకీర్తన, పల్లకీ ఉత్సవం, ఊంజల్ సేవలు నిర్వహించారు. మందిర మేనేజింగ్ ట్రస్టీ మధు సూదనసాయి భక్తు లందరికీ స్వామి వారి చిత్రపట క్యాలెండర్‌లను, పాకెట్ క్యాలెండర్ లను అందజేశారు.

# అనాధల గుడికి 'అమ్మఒడి' కావాలి

- 'వాత్సల్య'ం కోసం విపిఆర్‌కి వినతి



వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి - ప్రశాంతిరెడ్డి దంపతులకు వినతిపత్రం అందజేసి సత్కరించిన వాత్సల్య నిర్వాహకులు

అమ్మఒడి పథకాన్ని వాత్సల్య విద్యార్థులకు వర్తింపజేయాలని కోరుతూ రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ఈనెల 1న వాత్సల్య నిర్వాహకులు వినతి పత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి రాష్ట్ర విద్యాశాఖా మంత్రి ఆదిమూలపు సురేష్‌తో అప్పటికప్పుడు ఫోన్‌లో మాట్లాడారు. వాత్సల్యకు అమ్మఒడి పథకాన్ని వర్తింప చేయడానికి మంత్రి సానుకూలంగా స్పందించారు. వాత్సల్య అనాథ ఆశ్రమ గౌరవాధ్యక్షుడు సామంతు గోపాల్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివ రావులు వేమిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వాత్సల్య హైస్కూల్ ప్రిన్సిపల్ మధు సూదన్‌రెడ్డి, గిరి పాల్గొన్నారు.

## 3 రాజధానులకు నై..
# అమరావతికి సై
### నెల్లూరు అఖిలపక్ష సమావేశంలో నేతలు




ఇటీవల నెల్లూరు సరస్వతీనగర్‌లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో అమరావతి రాజధాని పరిరక్షణ కోసం అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సి.వి.శేషారెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మాజీమేయర్ అబ్దుల్ అజీజ్, మాజీమున్సిపల్ ఛైర్‌పర్సన్ టి.అనూరాధ, టీడీపీ నాయకులు ఆనం వెంకటరమణారెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జెన్ని రమణయ్య, బి.మనోహర్‌రెడ్డి, సిపిఐ నాయకులు రామరాజు, బీజేపీ నాయకులు మిడతల రమేష్, న్యాయవాదులు, విద్యార్థి, వ్యాపార, కళారంగాల ప్రముఖులు పాల్గొన్నారు. ఇప్పటికే అన్ని వసతులతో వున్న అమరావతి నుండి రాజధానిని మార్చడం సబబు కాదంటూ సమావేశంలో అభిప్రాయపడ్డారు. రాజధానిగా అమరావతిని అప్పట్లో ప్రతిపక్ష నేతగా వున్న వైయస్ జగన్మోహన్‌రెడ్డి కూడా సమర్థించాడని సోమిరెడ్డి చెబితే, విశాఖపట్నంకు రాజధానిని తరలిస్తే నెల్లూరు జిల్లాకు చాలా దూరమవుతుందని కొందరు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. చివరకు రాజధానిని అమరావతిలోనే కొనసాగించాలంటూ వీరు కోరస్‌గా డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపిజిఇఏ) క్యాలెండర్‌ను గతనెల 30న రాష్ట్ర మంత్రులు ఆళ్ళ శ్రీనివాస్, డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చేజర్ల సుధాకర్‌రావు, ఏనుగు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇటీవల గూడూరు, దివిపాళెం పంచాయితీలోని ఇయస్‌ఐ చర్చిలో గిరిజనులకు చీరలు పంపిణీ చేస్తున్న ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి మరియు సభ్యులు

# మాతృభాషను కాపాడుకుందాం



సమావేశంలో ప్రసంగిస్తున్న సర్వేపల్లి రామమూర్తి

మన మాతృభాషను కాపాడుకోవాలని, తెలుగుకు మరింత వెలుగునివ్వాలని స్టేట్‌లీడర్ పత్రిక సంపాదకుడు సర్వేపల్లి రామమూర్తి పేర్కొన్నారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన 4వ ప్రపంచ తెలుగు మహాసభల్లో గతనెల 29 తేదీ జరిగిన సభలో ఆయన పాల్గొని తెలుగు భాష విశిష్టతను గురించి వివరించారు. తెలుగు ఎంతో ప్రాచీనమైన భాష అని, మధురమైన భాష అని అన్నారు. మాతృభాష పరిరక్షణకు కేంద్రప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమానికి దూరదర్శన్ మాజీ డైరెక్టర్, డా. రేవూరి అనంత పద్మనాభరావు అధ్యక్షత వహించగా, మండలి బుద్ధప్రసాద్, పాత్రికేయులు తుర్లపాటి కుటుంబరావు, పత్రికా సంపాదకులు ఎంవిఆర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## ఏ.ఓగా ఏడుకొండలు

నెల్లూరుజిల్లా కలెక్టరేట్ పరిపాలనాధికారి(ఏ.ఓ)గా ఏడుకొండలును నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఏ.ఓగా వున్న రామారావుకు ఇంకా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

## పక్షుల పండుగకు సిద్ధం

ఈనెల 3, 4, 5తేదీలలో సూళ్లూరుపేటలో నిర్వహించబోయే పక్షుల పండుగ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు పర్యవేక్షణలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనులు ముగించారు. 3వ తేదీ ఇన్‌ఛార్జ్ మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి ఈ పండుగను ప్రారంభించనున్నారు.

## విహారంలో విషాదం

నూతన సంవత్సర వేడుకలు సరదాగా జరుపుకుందామని వచ్చి, ముగ్గురు ప్రాణాలు కోల్పోయిన సంఘటన బుధవారం వాకాడు మండలం తూపిలిపాళెం బీచ్ వద్ద చోటుచేసుకుంది. చిత్తూరుజిల్లా తిరుపతిలోని జీవకోనకు చెందిన రాహుల్ ద్రావిడ్, దుగ్గిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బత్తల సోనియా, దేరంగుల సోనులు న్యూఇయర్ వేడుకల కోసమని ఒక కారులో తూపిలి పాళెం బీచ్‌కు 31వ తేదీ రాత్రి చేరుకున్నారు. 1వ తేదీ ఉదయం సముద్రం అలల మధ్య ఆడుకుంటూ రాహుల్, సోనియా, సోనులు అలల ఉధృతికి కొట్టుకుపోయి ఊపిరాడక మరణించారు.

# వాకర్స్ నూతన సంవత్సర వేడుకలు

## ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో...



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నలుబోలు బలరామయ్య నాయుడు ఆధ్వర్యంలో ఈనెల 1 న నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలు నిర్వహించారు. 2019కి వీడ్కోలు పలుకుతూ, 2020కి స్వాగతం పలికారు. వాకర్స్, క్రీడాకారులు వారి కుటుంబ సభ్యులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్టేడియంలో అందరికి ఉచితంగా చాక్లెట్లును పంపిణీ చేసారు. సెక్రటరి వినుకొండ వెంకటేశ్వర్లు, ట్రెజరర్ కొండూరు సుబ్బారావు, జీవీ కృష్ణయ్య, యు.వెంకటేశ్వర్లు, లక్ష్మి నారాయణ, బి.చెంచయ్య, కె శివయ్య, మాగంటి ప్రసాదు, జి.జయరాంనాయుడు, డాక్టర్ కె.సూర్యనారాయణ, లక్కాకుల శ్రీనివాసులు, ఐ.సోను, యస్ రాఘవేంద్రషెట్టి, పి.రవిచంద్ర, స్వర్ణ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జెడ్పీ వాకర్స్ సారధ్యంలో...



నూతన సంవత్సరం సందర్భంగా జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 1 న నెల్లూరు పొదలకూరు రోడ్డు డైకస్‌రోడ్డు సెంటర్ వద్ద నున్న డిఎన్‌యస్ చర్చి కాంపౌండ ఆవరణంలోని వికలాంగ బాలికల హాస్టల్లో వేడుకలు నిర్వహించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ యస్.రాఘవేంద్రషెట్టి పాల్గొని కేక్ కట్ చేసి బాలికలకు పంచిపెట్టారు. అనంతరం బ్యాంకు పెన్షనర్స్ సౌజన్యంతో అధ్యక్షులు చలంచర్ల భాస్కరరెడ్డి చేతుల మీదుగా హాస్టల్‌కు కావలసిన నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. డిస్ట్రిక్ట్ క్యాబినెట్ కార్యదర్శి నలుబోలు బలరామయ్యనాయుడు, ట్రెజరర్ రాజారమేష్, కౌన్సిల్ మెంబర్ పోనం రవిచంద్ర, జెడ్పీ వాకర్స్ కార్యదర్శి జేయస్ఆర్ ఆంజనేయులు, మెట్టు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసనాయుడు, శ్రీనివాసులు, బాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# వెలుగురేఖ.. విశాఖ

(మొదటి పేజీ తరువాయి)

కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రానికి కొత్త రాజధానిని ఏర్పాటు చేసుకోవడంలో అర్థముంది. కాని ఆంధ్రప్రదేశ్ కొత్త రాష్ట్రం కాదు, 2014లో విభజన జరిగినప్పుడు రాజధానిని కోల్పోయిన రాష్ట్రం. దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రం కూడా ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొని వుండదు. ఒక పెద్ద రాష్ట్రం... పరిపాలనా వ్యవస్థలన్నీ వున్నాయి.. కాని ఒకచోట కూర్చుని పరిపాలించడానికి అన్ని సదుపాయాలు కలిగిన ఒక నగరం, లేదా ఒక పట్టణం కావాలి. 2014లో చంద్రబాబు గుంటూరు, ఒంగోలు, విజయవాడ, మంగళగిరి వంటి నగరాలను, పట్టణాలను కేంద్రంగా చేసుకుని రాజధానిని ఏర్పాటు చేసివుంటే, అక్కడ దాదాపు అన్నీ మౌలిక వసతులు వున్నాయి కాబట్టి త్వరితగతిన రాజధాని అభివృద్ధి చెందడానికి అవకాశముండేది. బయట ప్రాంతాలవాళ్ళు కూడా వచ్చి పెట్టుబడులు పెట్టడానికి, స్థిర నివాసం వుండడానికి అవకాశం వుండేది. కాని, చంద్రబాబు అమరావతిని ఎంచుకున్నందువల్ల ఈరోజు రాజధానికి ఈ గతి పట్టింది. దాదాపు 50వేల ఎకరాలలో పూర్తిగా కొత్త నగరాన్ని నిర్మించాలంటే అలివయ్యేపనేనా? అసలు రాష్ట్రం ఇప్పుడున్న పరిస్థితుల్లో అంత అవసరం కూడా లేదు. అమరావతిని రాజధాని అనగానే... అక్కడకు సామాన్యులు పోలేరని, మధ్య తరగతి వాళ్లకు స్థలాల ధరలు అందుబాటులో వుండవని, కేవలం ఒక వర్గం వారికి మాత్రమే ప్రాతినిధ్యం వుంటుందనే ప్రచారం వచ్చేసింది. ఐదేళ్ల పాలనలో 'అమరావతి' అంటూ పదేపదే కలవరించడం తప్పించి స్థిరమైన రాజధాని ఏర్పాటు దిశగా చంద్రబాబు చేసిన ప్రయత్నాలు ఏమీ లేకపోవడం అమరావతికి శాపంగా మారింది.

## విశాఖ ఎంపిక సముచితమేనా?

ఒక కుటుంబం నివసించడానికి 50 అంకణాల స్థలం సరి పోతుందనుకుందాం, ఆ 50 అంకణాలలో ఇల్లు కట్టుకుంటే ఒక కోటి రూపాయల బడ్జెట్‌తో పోతుంది. అలా కాకుడా 500 అంకణాలలో భారీ ఇల్లు కట్టుకోవాలని చెప్పి ఫౌండేషన్ వేస్తే.. ఆ ఇల్లును పూర్తి చేయాలంటే కనీసం 50కోట్లు కావాలి. కోటితో పోయేదానికి 50కోట్లు అవసరమా? ఇప్పుడు అమరావతి విషయం కూడా అంతే! చంద్రబాబు పునాది వేసిన అమరావతి రాజధానిని పూర్తి చేయాలంటే లక్ష కోట్లకు పైమాటే ఖర్చు. అది కూడా ఎప్పటికి అందుబాటులోకి వస్తుందో చెప్పలేని పరిస్థితి. దాని బదులు విశాఖపట్నం మీద గట్టిగా పదివేల కోట్లు ఖర్చు పెడితే దాదాపు హైదరాబాద్‌కు సరితూగే స్థాయికి రాజధాని సిద్ధమవుతుంది. అది కూడా గట్టిగా మూడు నాలుగేళ్లలోనే!

## దూరం పెద్ద సమస్య కాదు!

అమరావతి అయితే రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు మధ్యలో వుంటుందని, విశాఖపట్నం అయితే ప్రకాశం నుండి అనంతపురం వరకు అందరికీ దూరమేననే వాదనలున్నాయి. రాజధాని ఎంత దూరంలో వుందన్నది పెద్ద సమస్య కాదు. అలాఅనుకుంటే చెన్నై, బెంగుళూరులు ఆ రాష్ట్రాలకు ఒక కొసన వున్నాయి. ముఖ్యంగా ప్రజలకు రాజధానితో పెద్దగా పని వుండదు. తమ గ్రామాలలో వున్న గ్రామ సచివాలయాలకే వాళ్లు పెద్దగా వెళ్లే పనులుండవు. సామాన్య ప్రజలు తమ మండల తహశీల్దార్ కార్యాలయానికి పోవడమే ఎక్కువ. ఇంక పరిష్కారం కాని సమస్యలేమన్నా వుంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం దాకా పోగలరు. రాష్ట్ర సచివాలయానికి వచ్చేవాళ్ళు వెయ్యికి ఒక్కరు కూడా వుండరు. కేవలం రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు, ఉన్నతాధికారులు, పెద్దపెద్ద వ్యాపారవేత్తలకే రాజధానిలో పనులుంటాయి. వాళ్లకు రాజధాని ఏ మూలనవున్నా వెళ్లడం పెద్ద కష్టమేమీ కాదు.

## రాజధాని... అవకాశాల గని

రాజధానితో సామాన్యులకు పని లేకపోవచ్చు, కాని సంబంధాలు లేకుండా పోవు. ఈరోజు హైదరాబాద్‌నే చూద్దాం. ఏపిలోని 13జిల్లాల్లో వున్న వారిలో ప్రతి కుటుంబం నుండి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గానో, రియల్ ఎస్టేట్ వ్యాపారిగానో, ప్రభుత్వ ఉద్యోగంలోనో, ఇతరత్రా వ్యాపారాలు, కాంట్రాక్ట్ రంగాలలో స్థిరపడిన వాళ్ళు కోకొల్లలుగా వున్నారు. అంటే హైదరాబాద్ నగరం ఉపాధి అవకాశాల ఉత్పత్తి కేంద్రం అయ్యిందన్న మాట. అన్ని ప్రాంతాల వాళ్ళు, అన్ని జిల్లాల వాళ్ళు అక్కడ పెట్టుబడులు పెట్టారు. అన్ని రంగాలను అభివృద్ధి చేశారు. స్థానికులూ సహకరించారు. పరస్పర సహకారంతో హైదరాబాద్ అభివృద్ధి అయ్యింది.

## సినీ పరిశ్రమ వస్తే పండుగే

మెట్రోపాలిటిన్ సిటీస్‌కి సినీ పరిశ్రమ అన్నది వెన్నెముక. ఈరోజు దీని చుట్టూనే వేలకోట్ల వ్యాపారం జరుగుతోంది. స్టూడియోలు, ఫిలిం సిటీలు, వేలమందికి ఉపాధి అవకాశాలు, ఈవెంట్లు... ఇలా ఎన్నో రకాలుగా ఈ పరిశ్రమ విస్తరించి వుంది. ముఖ్యంగా గ్లామర్ ఫీల్డ్ ఇది. ఏ నగరానికైనా ఇదే ఒక కళ. మద్రాసు నుంచి తెలుగురాష్ట్రం విడిపోయాక, తెలుగు సినీ పరిశ్రమను హైదరాబాద్‌కు తీసుకురావడానికి దాదాపు 35ఏళ్లు పట్టింది. కాంగ్రెస్ పాలనలో ఆనాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి సినీ పరిశ్రమకు హైదరాబాదులో భారీ తాయిలాలు ఇచ్చి వారిని ఆంధ్రప్రదేశ్‌లోకి రప్పించే ప్రయత్నానికి శ్రీకారం చుడితే, ఆ తరువాత స్వర్గీయ నందమూరి తారకరామారావు ముఖ్యమంత్రిగా వున్న సమయంలో పట్టుబట్టి సినీ పరిశ్రమను హైదరాబాద్‌కు తేగలిగాడు. అయితే రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కొత్తగా ఏర్పడ్డ అమరావతి వైపు సినీ పరిశ్రమకు చెందిన ఏ ఒక్కరూ కన్నెత్తి కూడా చూడలేదు. ముఖ్యంగా చంద్రబాబు అనుచరులుగా, ఆప్తులుగా ముద్రపడ్డ సినీ ప్రముఖులు కూడా సినీ పరిశ్రమను ఏపికి తరలించడానికి ఇష్టపడలేదు. మేము హైదరాబాద్‌లోనే సెటప్ అవుతామని మొండికేశారు. అమరావతి రాజధానిగా ఉండుంటే సినీ పరిశ్రమను ఏపికి తరలించడానికి ఒక్క శాతం కూడా అవకాశం లేదు. కాని, వైజాగ్ రాజధానిగా ఉంటే సినీ పరిశ్రమను ఇక్కడకు తరలించడానికి ఎన్నో అవకాశాలున్నాయి. ఇప్పటికే వైజాగ్ కేంద్రంగా దాదాపు 70శాతం తెలుగు సినిమాలు షూటింగ్ జరుపుకుంటున్నాయి. అరకు లోయతో పాటు విశాఖ, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలు మంచి షూటింగ్ స్పాట్‌లుగా ఉపయోగపడుతున్నాయి. వైజాగ్‌లో ఇప్పటికే రామానాయుడు స్టూడియో వుంది. స్టార్ హోటల్స్, ఆసుపత్రులు ఉన్నాయి. సాంకేతికంగా సినీ పరిశ్రమకు కావాల్సిన సదుపాయాలు ఇక్కడ ఏర్పరిస్తే ఆ పరిశ్రమను విశాఖకు తరలించడం పెద్ద సమస్య కాకపోవచ్చు.

## విశాఖకు ఆ అవకాశముంది

హైదరాబాద్ తర్వాత ఆ విధంగా అన్ని రంగాలలో అభివృద్ధి చెందడానికి అవకాశాలున్నది విశాఖ నగరానికే! హైదరాబాద్ స్థాయి నగరమిది. పర్యాటకంగా మొదటినుండి పేరుంది. కులముద్రలు లేని నగరం. అన్ని ప్రాంతాలవాళ్ళు నివసించడానికి అవకాశమున్న నగరం. సచివాలయ ఉద్యోగులు స్థిరనివాసం ఉండడానికి అవకాశాలున్న నగరం. భూములూ అందుబాటులో వున్నాయి. ఇప్పటికే పారిశ్రామికంగానూ అభివృద్ధి చెంది వుంది. రోడ్డు, రైలు, జల మార్గాలు అనుసంధానమై వున్నాయి. పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడానికి అవకాశాలున్నాయి. ఉపాధి అవకాశాలు పెరిగే సూచనలున్నాయి. ఐటి రంగం కూడా అడుగుపెడితే దీని దశ తిరుగుతుంది. టూరిజం పరంగా ఎంతో అభివృద్ధికి ఆస్కారముంది. రాజధాని అంటే పదిమంది రావాలి, పది మంది బ్రతకాలి. అందుకు సరైన వేదిక విశాఖ. ఇప్పుడు రాజధానిగా నిర్ణయించారు కాబట్టి ప్రైవేట్ రంగంలో సైతం ధైర్యంగా పెట్టుబడులొస్తాయి. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. రాజధాని కోసం వేలు లక్షల కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండానే విశాఖ ఒక సంపూర్ణ రాజధానిగా రూపాంతరం చెందుతుంది. ఇందులో ఎటువంటి సందేహం లేదు.

# 'బర్డ్' డైరెక్టర్‌గా డాక్టర్ మదన్

(మొదటి పేజీ తరువాయి)

గత కొన్నేళ్లుగా నెల్లూరు అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలోనూ ఆర్థోపెడిక్ వైద్యవిభాగంలో సేవలందిస్తున్నారు. దేశంలోనే అత్యుత్తమ ఆర్థోపెడిక్ సర్జన్‌లలో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. మోకీళ్ల మార్పిడి ఆపరేషన్‌లలో ఆధునాతన విధానాలను ప్రవేశపెట్టింది కూడా ఆయనే! సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యుడిగా డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి కుటుంబంతోనూ ఆయనకు సన్నిహిత సంబంధాలున్నాయి. శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సర్జరీ, రీసెర్చ్ & రెహాబిలిటేషన్ ఫర్ ది డిసేబుల్డ్-బిఐఆర్‌ఆర్‌డి(బర్డ్) అన్నది ఆర్థోపెడిక్ వైద్యపరంగా రోగులకు సేవలందించే సంస్థ. ప్రతియేటా కొన్ని వేలమంది రోగులకు 'బర్డ్'లో ఆపరేషన్‌లు, ఉచిత వైద్యసేవలు అందుతుంటాయి. 'బర్డ్' పర్యవేక్షణ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి వంటివారి సారధ్యంలో వుంటే ప్రజలకు ఇంకా మెరుగైన సేవలు అందించవచ్చని భావించి ఈ బాధ్యతను ఆయనకు అప్పగించారు. నిద్రలేస్తే ప్రతిక్షణం కూడా అమూల్యంగా గడిచిపోయే మదన్ మోహన్‌రెడ్డి 'బర్డ్'కు సేవలందించే అవకాశాన్ని ఆ ఏడుకొండల వాడే ప్రసాదించాడని భావించి కార్యనిర్వహణకు సన్నద్ధులైనారు. 'బర్డ్' డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టబోతున్న డాక్టర్ మదన్ మోహన్‌రెడ్డికి 'లాయర్' అభినందనలు.

### పదవీ విరమణ చేసినా..

# మనమంతా ఒకే కుటుంబం

**జిల్లా ఎస్పీ భాస్కర భూషణ్**

క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందుతున్న సిబ్బంది సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా ఎస్పీ భాస్కర భూషణ్ పేర్కొన్నారు. గతనెల 31న నెల్లూరులోని ఉమేష్ చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాలులో డీసీఆర్‌బీ ఎస్సై ఏడుకొండలు, ఉదయగిరి ఏఎస్సై బి. శ్రీనివాసులు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు పదవీ విరమణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన సిబ్బంది తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలన్నారు. ఎస్పీ నుంచి కిందిస్థాయి వరకు అందరిదీ ఒకటే కుటుంబమని, అది పోలీసు కుటుంబమన్నారు. వారందరూ తమ తల్లిదండ్రులతో సమానమన్నారు. ఏ అవసరం వచ్చినా తనను కలవాలన్నారు. పదవీ విరమణ పొందిన రోజే రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. తొలుత పదవీ విరమణ చేసిన వారిని సత్కరించారు. ఏఎస్పీ(క్రైమ్స్) పి.మనోహర్‌రావు, ఏఆర్ ఏఎస్పీ ఎస్.వీరభద్రుడు, ఏఆర్ డీఎస్పీ వై.రవీంద్రరెడ్డి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు డివిజన్‌లో 33,850 మందికి ఇళ్ళ స్థలాలు

నెల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉగాదినాటికి 33,850 మందికి ఇళ్ళ నివేశన స్థలాలు పంపిణీ చేస్తామని ఆర్డీఓ డి.హుస్సేన్‌సాహెబ్ పేర్కొన్నారు. గతనెల 31న ఆయన పొదలకూరులోని రెవెన్యూ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో 18,688 మందికి ఇళ్ళ నివేశన స్థలాలు అందజేస్తామని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములనే అధికంగా గుర్తించామని, ఉగాది సందర్భంగా లబ్దిదారులకు పట్టాలను అందజేయడంతో పాటు లేఅవుట్‌లో ఉన్న ప్లాట్‌లకు హద్దులు చూపించి పొజిషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేస్తామన్నారు. ఈ స్థలాల పంపిణీలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోందని ఎక్కడా ఎలాంటి పొరపాట్లు లేకుండా పక్కాగా స్థలాలను అర్హులైన పేదలకు అందజేస్తామని వివరించారు.

# జన్మభూమికి వెంకయ్య

ఎంతటి ఉన్నత పదవిలో వున్నా ప్రతి యేడాది సంక్రాంతి పండక్కి జన్మభూమి నెల్లూరు సీమకు రావడం ఆయనకు అలవాటు. అయితే ఉపరాష్ట్రపతి అయ్యాక జన్మభూమికి రావడం మానుకోలేదుగాని, వచ్చే రోజులలో కొంచెం తేడా వచ్చింది. ఈ సంవత్సరం కూడా ఆయన ఈ నెల 19 నుండి 21వ తేదీ వరకు జిల్లాలోనే గడపబోతున్నారు. 19, 20 తేదీలలో ఆయన ప్రైవేట్, ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొంటారు. 21వ తేదీ మాత్రం తన కృషితో మైసూరు నుండి నెల్లూరుకు తరలివచ్చిన ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని ఆయన ప్రారంభించబోతున్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు వైయస్ జగన్మోహన్‌రెడ్డి, కె.చంద్రశేఖర్‌రావు, ఏపి గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, ఇంకా కేంద్రమంత్రులు, పలువురు రాష్ట్ర మంత్రులు హాజరయ్యే అవకాశాలున్నట్లు సమాచారం. అయితే దీనికి సంబంధించి అధికారిక షెడ్యూల్ ఇంకా ఖరారు కావాల్సివుంది.

# ముహూర్తం ఖరారైనట్లే

(మొదటి పేజీ తరువాయి)

త్వరలో తెలుగుదేశం నుండి వేరుపడడానికి సిద్ధంగా వున్నట్లు తెలుస్తోంది. ఇక ప్రకాశం జిల్లా నుండి ముగ్గురు ఎమ్మెల్యేలు తెలుగుదేశంను వదలడానికి సిద్ధంగా వున్నారని సమాచారం. కృష్ణా, గుంటూరు, విశాఖపట్నం జిల్లాల్లోనూ టిడిపి వదిలి వేరు కుంపటి పెట్టడానికి కొందరు ఎమ్మెల్యేలు రెడీగా వున్నారు. వీరంతా పదిమందిదాకా వుంటారు. వీరు బయటకు వస్తే చంద్రబాబుకు ప్రతిపక్ష నేత హోదా పోతుంది. 2020కి ఆయనకు లభించే పెద్ద బహుమతి అదే అవుతుంది.

# వీణ విద్వాంసుడు మాదేశ్వరకుమార్ కన్నుమూత



ప్రముఖ వీణ విద్వాంసుడు, ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో వీణ విద్వాంసునిగా పని చేస్తున్న బండ్లమూడి మాదేశ్వరకుమార్(56) గత నెల 30వ తేది తెల్లవారుజామున కన్నుమూశారు. ఈయన 2009 నుండి ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో వీణ అధ్యాపకులుగా పనిచేస్తూ ఎంతో మంది విద్యార్థినీవిద్యార్థులను వీణ కళాకారులుగా తర్ఫీదు ఇచ్చి వారు అత్యున్నత స్థాయిలో ఉత్తీర్ణులయ్యేందుకు ఎంతో కళాసేవ చేశారు. అత్యుత్తమ ఉపాధ్యాయుడుగా ఆయన 45 సంవత్సరాలుగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన ఆకస్మిక మరణానికి నెల్లూరు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపల్ మద్దెల సాయిబాబు, అధ్యాపకులు తిరుపతమ్మ, లోకేష్ బాబు, పినాకపాణి, సురేష్, మల్లిఖార్జున, సిబ్బంది తమ సంతాపాన్ని తెలిపారు.

# విపిఆర్‌లో 2020 సందడి

2019కి వీడ్కోలు పలుకుతూ 2020ని స్వాగతిస్తూ విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 31వ తేదీ విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన వేడుకలు అందరినీ అలరించాయి. సుప్రసిద్ధ సినీ గాయకులు హేమచంద్ర, శ్రావణభార్గవి దంపతులతో పాటు పాడుతా తీయగా విజేతలు పరమేశ్వర్, సుగంధినిలు చేసిన పాటల సందడితో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు.



కేక్ కట్ చేసి కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తున్న విపిఆర్ దంపతులు



రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలు శ్రీమతి ప్రశాంతిరెడ్డిలను ఆత్మీయంగా సత్కరిస్తున్న ప్రశాంతిరెడ్డి స్నేహితురాళ్ళు.

## ఆదాలను కలిసిన శ్రీధర్ కోర్పపాటి

నాటా 2020 - 22 అధ్యక్షుడు కోర్సపాటి శ్రీధర్‌రెడ్డి ఇటీవల నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశాడు. 2020 జూన్‌లో జరిగే నాటా వేడుకలకు రావాల్సిందిగా ఆయన ఆదాలను ఆహ్వానించాడు.









9వ వర్ధంతి

పూజ్యులు, మా ఇంటి దైవం
మా పురోభివృద్ధికి ముఖ్యకారకులు, "మిత్రబంధు"
శ్రీ నారపరెడ్డి కోదండరామరెడ్డి, M.A. గారు
(మైపాడు వాస్తవ్యులు)
స్వర్గస్తులై తేది 05-01-2020 నాటికి
తొమ్మిది సంవత్సరాలు నిండనున్న సందర్భంగా
ఆయన దివ్యస్మృతిని స్మరించుకుంటూ
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

శ్రీమతి నారపరెడ్డి సులోచనమ్మ - భార్య

కుమారులు - కోడళ్ళు
డాక్టర్ ఎన్.విష్ణుస్వరూప్‌రెడ్డి - డాక్టర్ శాంతి
ఇ.ఎన్.టి & ఫేషియల్ ప్లాస్టిక్ సర్జన్, కేర్ హాస్పిటల్, బంజారాహిల్స్, హైదరాబాద్. - ఒబేస్టిట్రిషియన్ & గైనకాలజిస్ట్ అపోలో హాస్పిటల్, జూబ్లీహిల్స్, హైదరాబాద్.
ఎన్.వినోద్‌రెడ్డి - శాలిని
చైర్మెన్ & ఎం.డి., సిఆర్‌ఎంఐటి గ్రూప్, బెంగుళూరు. - డైరెక్టర్, సిఆర్‌ఎంఐటి గ్రూప్, బెంగుళూరు.

కుమార్తెలు - అల్లుళ్ళు
జి.సుప్రియ - జి.విజయసింహారెడ్డి
డైరెక్టర్, ఫార్చ్యూన్ ఇండియా బిల్డర్స్, బెంగుళూరు.
ఎన్.పద్మప్రియ - ఎన్.చంద్రారెడ్డి
చైర్మెన్ & ఎం.డి., ఫార్చ్యూన్ ఇండియా బిల్డర్స్, బెంగుళూరు.

మనుమలు, మనుమరాండ్రు
జి.అభిషేక్‌రెడ్డి, సిఆర్‌ఎంఐటి (డైరెక్టర్, ఆస్ట్రేలియా), వైష్ణవి
జి.అనుదీప్(డైరెక్టర్, సిఆర్‌ఎంఐటి సొల్యూషన్స్, యు.యస్.ఏ), భావిక
రాహిల్, రుషిల్ సాకేత్, విశాల్, మేఘన, హర్ష, సంజన, వినూష
మునిమనుమరాలు - అమైర

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com